RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 27 ఆగస్ట్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:77

## తెలంగాణలో ఆయిల్‌పామ్‌కు భారీ ప్రోత్సాహం

**వరి సాగుకు లాభదాయక ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్**

**సూర్యాపేటలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్‌పామ్ హబ్ ఏర్పాటుకు రిలయన్స్ ఆసక్తి**

**కోదాడ--హుజూర్‌నగర్ నుంచే ఆయిల్‌పామ్ విస్తరణకు శ్రీకారంగ్**


**ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలనూ అనుసంధానిస్తూ భారీ ప్రణాళిక**

**తోటల నుంచి ప్రాసెసింగ్, రిఫైనరీ, అనుబంధ పరిశ్రమల వరకు సమగ్ర వ్యవస్థ**

**ఎల్‌నినో పరిస్థితులు.. జలాశయాలకు అనిశ్చిత ప్రవాహాల నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం**

**రైతుకు ఆదాయం.. సాగునీటిపై ఒత్తిడి తగ్గింపు.. రాష్టానికి పారిశ్రామిక ప్రగతి**

**మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 26: నీటిని అధికంగా వినియోగించే వరి సాగుపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ, రైతులకు స్థిరమైన, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు భారీ ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించింది. ఆయిల్‌పామ్ తోటల విస్తరణతో పాటు ప్రాసెసింగ్, రిఫైనింగ్, అనుబంధ పరిశ్రమలను ఒకే గొలుసులో అనుసంధానిస్తూ సమగ్ర 'ఫార్మ్ టు ఇండస్ట్రీ' ఆయిల్‌పామ్ వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

ఈ దిశగా రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖేతన్ మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డితో విస్తృతంగా చర్చించారు. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ అర్పన్ బసు, స్టేపుల్స్ విభాగం అధిపతి సంజీవ్ గిరి, ఉద్యానవన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "రైతును వరి సాగు నుంచి మరో పంటవైపు మళ్లించాలంటే కేవలం సూచనలు సరిపోవు. ప్రత్యామ్నాయ పంట వరికంటే మెరుగైన ఆదాయం ఇవ్వాలి. మార్కెట్‌పై భరోసా ఉండాలి. పంట చేతికొచ్చిన వెంటనే కొనుగోలు, ప్రాసెసింగ్‌కు వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. అప్పుడే పంటల వైవిధ్యీకరణ విజయవంతమవుతుంది" అని స్పష్టం చేశారు.

కోదాడ--హుజూర్‌నగర్ నుంచే తొలి అడుగు సూర్యాపేట జిల్లాలో, ముఖ్యంగా ఒకదానికొకటి ఆనుకొని ఉన్న కోదాడ--హుజూర్‌నగర్ ప్రాంతాన్ని ఆయిల్‌పామ్ ప్లాంటేషన్--ప్రాసెసింగ్ క్లస్టర్‌కు ప్రారంభ కేంద్రంగా పరిశీలించాలని రిలయన్స్ ప్రతినిధులకు ఉత్తమ్ సూచించారు. తదుపరి దశలో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలను కూడా అనుసంధానించడం ద్వారా విస్తృతమైన ముడిసరుకు సేకరణ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు.

మిగతా 2 లో

## పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

**నిపుణులతో కమిటీల ఏర్పాటు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం నాడు మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు.



సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లు

**రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మార్కెటింగ్ సేవల విస్తరణ**

**మెటాతో కలిసి వీఎల్‌ఈలకు ప్రత్యేక శిక్షణ**

**కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్, ఆగస్టు 26:తెలంగాణలోని ప్రతి మీ సేవా కేంద్రాన్ని డిజిటల్ మార్కెటింగ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక వ్యాపారులకు డిజిటల్ ప్రచార అవకాశాలను చేరువ చేయడమే లక్ష్యంగా మీ సేవా--మెటా సంయుక్త కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని షెరటాన్ హోటల్‌లో బుధవారం మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ రెండో దశ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 140 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్లు (వీఎల్‌ఈలు) హాజరయ్యారు. వీరికి 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.




ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొత్త సాంకేతికతను స్వీకరించడంలో తెలంగాణ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. సమర్థవంతమైన పౌర సేవలను అందించడంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు.

మిగతా 3 లో

## పేదవాడి ఇంటి కోసం కేంద్రం నిధులు ఇవ్వకపోయినా వెనక్కి తగ్గం

**గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం కేంద్రం సహాయం అందిస్తుందన్న ఆశతో ఎదురు చూశాం**

**ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు**

**మార్చి 31 వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది**

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్నా పేదల కోసం రూ.185 కోట్లు విడుదల చేశాం**

**15,475 మంది లబ్ధిదారుల ఖాతాల్లో చివరి బిల్లులు జమ చేసాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్ , ఆగస్టు 26:పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని అనేకమార్లు విజ్ఞప్తి చేయడం జరిగింది.

కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న నమ్మకంతో ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చివరి బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని, కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ గారిని పలుమార్లు కలిసి తెలంగాణకు ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కేంద్ర మంత్రి వచ్చిన సందర్భంలో, రెండు వారాల క్రితం పార్లమెంటు సభ్యులతో కలిసి నేను స్వయంగా కేంద్ర మంత్రి గారిని కలిసి విజ్ఞప్తి చేశాను. అయినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు.కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశ పెట్టుకుని పేద ప్రజలను ఇంకా ఎన్నాళ్లు ఇబ్బంది పెట్టాలి? ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు చివరి బిల్లు కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. కేంద్రం తన బాధ్యత నిర్వర్తించకపోయినా పేదవాడి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్వర్తిస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించక పోయిన కూడా పేదల సొంతింటి కలను నెరవేర్చడాన్ని ప్రజా ప్రభుత్వంఅత్యంతప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

మిగతా 2 లో

## దివంగత శేషమ్మకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు

హైదరాబాద్ మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి శేషమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. శేషమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి , రాజేష్ రెడ్డి, నాగరాజు తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఓనం పండుగ శుభాకాంక్షలు



ఓనం పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.కేరళం సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఓనం వేడుకలు.. కళారూపాలు, ఆచార సంప్రదాయాలతో భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రకృతికి కృతజ్ఞత, సోదరభావం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో కలిసి ఆనందాన్ని పంచుకునే స్ఫూర్తిని ఓనం చాటుతుందని అన్నారు.ఓనం పర్వదినం ప్రతి ఇంటా ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని.. ఐక్యత, సోదరభావనను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

ప్రజాబలం

27 ఆగస్ట్ 2026 గురువారం

# మోదీ మాస్టర్ స్ట్రోక్!

భారత రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలకమైన 'జమిలి ఎన్నికల' విధానంపై మరోమారు చర్చ మొదలైంది. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ సర్కారు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల శాసన సభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. భారత ఎన్నికల వ్యవస్థలో పెద్ద మార్పు తీసుకురావాలనే ప్రయత్నం కొన్ని నెలలుగా కొనసాగుతోంది. లోక్‌సభ, విధానసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'వన్ నేషన్?వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చర్చలు తీవ్రమవుతున్నాయి. కమిటీ ఛైర్మన్ పీపీ చౌదరి ఇటీవలి అప్‌డేట్‌లో స్టేక్‌హోల్డర్లలో అధిక శాతం మద్దతు ఉందని, 2034కు బదులు 2029లోనే అమలు చేయవచ్చని సూచించారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అయింది.జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి ప్రకారం, ఇప్పటివరకు సంప్రదించిన సివిల్ సొసైటీ, నిపుణులు, వివిధ సంస్థల్లో సుమారు 99 శాతం మంది జమిలి ఎన్నికలకు అనుకూలంగా మాట్లాడారు. కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది. రాజ్యాంగ సవరణ 2028లోగా పూర్తయితే, 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు కొన్ని విధానసభలను కలిపి నిర్వహించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి కీలకం. కొన్ని రాష్ట్రాలు తమ అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేసి చక్రం సరిపోల్చుకుంటే మరింత సులభమవుతుంది. దేశంలోని 17 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్నది. మరో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయి. అలా మొత్తంగా 22 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగడానికి ముందే ఎన్డీయే పాలిత 11 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మరో నాలుగు ఎన్డీయే రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా ఏడు ఎన్డీయేపాలిత రాష్ట్రాల ఎన్నికలు 2030–31 మధ్య జరుగనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల కోసం తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పాలనను వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది.2029లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో 'జమిలి' ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కావడం లేదు. అయితే 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, త్రిపుర, తెలంగాణ, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం అసెంబ్లీల గడువు ముగుస్తున్నది. జమిలి ఎన్నికల కోసం ఆయా అసెంబ్లీల కాలాన్ని 5 నెలల నుంచి ఏడాది వరకు పొడిగించాల్సి ఉంటుంది.ఇక బీహార్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు 2030–31లో ముగియనున్నది. వాటి గడువును ఒకటి నుంచి రెండేండ్లు తగ్గించాల్సి వస్తుంది. అయితే, ఇంతటి భారీ సంస్కరణకు పార్లమెంట్ శాసనపరమైన మార్పులు చేయడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ప్రతిపాదనను జార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష ప్రభుత్వాలు పెద్దయెత్తున వ్యతిరేకించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే తొలుత తాము అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో జమిలి ప్రక్రియను కొనసాగించడానికి ఎన్డీయే ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయిగతంలో 2034ని లక్ష్యంగా చెప్పినా, ఇప్పుడు ముందుకు తీసుకురావాలనే ఆలోచన బలపడుతోంది. ఇది రెండు దశల్లో అమలు కావచ్చు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం, ప్రియాంకా గాంధీ వాద్రా, సాగరికా ఘోష్, సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. చిదంబరం బలంగా వ్యతిరేకించారు. ప్రస్తుత రూపంలోని ప్రతిపాదన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఎన్నికైన అసెంబ్లీల పదవీకాలాన్ని తగ్గించడం సమస్యాత్మకమని అభిప్రాయపడ్డారు. మరోవైపు పద్మ అవార్డు గ్రహీతలు, కొన్ని పాలసీ గ్రూపులు జాతీయ ప్రయోజనంగా చూశారు. అయితే తగిన రక్షణలు, స్పష్టమైన నిబంధనలు అవసరమని సూచించారు. ఎన్నికల కమిషన్‌కు అధిక అధికారాలు రాకుండా జాగ్రత్తలు కావాలని కూడా అభిప్రాయాలు వచ్చాయి.మద్దతుదారులు పదేపదే ఎన్నికల వల్ల జరిగే ఆర్థిక నష్టం, అభివృద్ధి పనుల్లో అంతరాయం, మోడల్ కోడ్ వల్ల పాలనా స్తబ్దతను ఎత్తి చూపుతున్నారు. జమిలి ఎన్నికలు ఖర్చు తగ్గించి, పాలనకు స్థిరత్వం ఇస్తాయని వాదిస్తున్నారు. ఇక వ్యతిరేకులు ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం, ప్రాంతీయ సమస్యలు జాతీయ అంశాల్లో కలిసిపోయే అవకాశం, చిన్న పార్టీలపై ప్రభావం లాంటి వాటిని లెక్కపెడుతున్నారు.జేపీసీ నివేదిక శీతాకాల సమావేశం వరకు వాయిదా పడింది. రాజకీయ సమ్మతి ఏర్పడితే 2029లో పాక్షికంగా అయినా అమలు సాధ్యమే. లేకపోతే 2034 వైపు వెళ్తుంది. ఈ ప్రతిపాదన భారత ప్రజాస్వామ్య పనితీరును పునర్నిర్మించే ప్రయత్నం. సమ్మతి, రాజ్యాంగ రక్షణలు, రాష్ట్రాల సహకారం లేకుండా ముందుకు సాగడం కష్టం. భవిష్యత్ దిశను నిర్ణయించేది పార్లమెంట్ చర్చలు, రాజకీయ సంకల్పమే.కుల గణన విధానంపై విశ్లేషకులు, కార్యకర్తలు, రాజకీయ నేతలతో 'స్క్రోల్' సంస్థ మాట్లాడినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారిలో అధికశాతం మంది కులాలను లెక్కించేందుకు ఎన్నుకున్న పద్ధతి లోపభూయిష్టమని అన్నారు. ఇటీవల బీహార్, తెలంగాణ తదితర రాష్ట్రాలు కులగణన నిర్వహించినప్పుడు 2011 మోడల్‌కు కట్టుబడి ఉండాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని వారు ప్రశ్నించారు. జనాభా లెక్కల్లో సేకరించే కుల డేటా నిరుపయోగంగా మారుతుందని కొందరు విమర్శకులు వాదించారు. 2021 సెప్టెంబర్ 21న మోదీ ప్రభుత్వం కుల గణన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అఫిడవిట్‌లోని 12(డి) పేరాలో '2011 జనాభా లెక్కల నిర్వహణకు ముందు కులాల రిజిస్ట్రీ ఏదీ సిద్ధం చేయలేదు' అని ఉంది. కాగా కులగణన కోసం ఎన్యూమరేటర్లు మొదట ప్రజలను షెడ్యూల్ కులాలు(ఎస్సీ) లేదా షెడ్యూల్ తెగలకు(ఎస్టీ) చెందినవారా కాదా అని అడుగుతారు. ఈ సమయంలో ప్రజలు తమ కులాన్ని ప్రకటించడానికి ఇష్టపడటం లేదని చెప్పే అవకాశం కూడా ఉందని 'ది హిందూ' పేర్కొంది. కాగా కులంపై పరిమితులు లేని ప్రశ్నలు ఉండటం వలన వైవిధ్యంతో కూడిన సమాధానాలు వస్తాయని ఇది అర్థవంతమైన విశ్లేషణను అందించదని విమర్శకులు వాదిస్తున్నారు. 2001 నుంచి జనాభా లెక్కల్లో కులం లెక్కింపుపై వాదన చేస్తున్న సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్ పాండే దీనిని ప్రణాళికాబద్ధమైన వైఫల్యం అని పేర్కొన్నారు. కులం గురించి పలు ప్రశ్నలు అడగడం వల్ల ఒకే సమాజానికి చెందిన వారు వేర్వేరు కులాల పేర్లతో తమను తాము గుర్తించుకునే అవకాశం ఉంది

# శ్రీలంక--తెలంగాణ బౌద్ధ, సాంస్కృతిక, పర్యాటక బంధానికి మరింత ఊతం

## శ్రీలంక కళాకారులకు మంత్రి జూపల్లి సత్కారం.. సాంస్కృతిక మార్పిడికి ప్రోత్సాహం



హైదరాబాద్: శ్రీలంక--తెలంగాణ మధ్య బౌద్ధ, సాంస్కృతిక, పర్యాటక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నాగపూర్ లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం, సింగిడి సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో ఇటీవల రవీంద్రభారతీలో నిర్వహించిన 4వ నృత్యంగాణ కార్యక్రమంలో శ్రీలంక సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించిన కళాకారుల బృందం బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో

మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసింది. శ్రీలంక కళాకారుల బృందాన్ని ఈ సందర్భంగా సన్మానించారు.

సాంస్కృతిక మార్పిడికి ప్రోత్సాహం

శ్రంగిక ననయక్కర నేతృత్వంలోని శ్రీలంక కళాకారుల బృందం, సింగిడి సాంస్కృతిక సంస్థ డైరెక్టర్ విశ్వకర్మ డి.ఆర్.కే. ఆధ్వర్యంలో మంత్రి జూపల్లిని కలిసింది. శ్రీలంక సంప్రదాయ నృత్యాలను తెలంగాణ వేదికపై ప్రదర్శించడంపై మంత్రి అభినందనలు తెలిపారు.

బౌద్ధం, సంస్కృతి, కళలు, వారసత్వం వంటి అంశాలు శ్రీలంక--తెలంగాణ మధ్య సుదీర్ఘ అనుబంధానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

నాగపూర్ దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను డైరెక్టర్ ఆస్తా కార్లేకర్.. మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్రానికి సహకారం అందించాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలతోనూ సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసే కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు.త్వరలోనే నాగపూర్‌లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రాన్ని సందర్శిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సాంస్కృతిక మార్పిడి, కళాకారుల పరస్పర భాగస్వామ్యం, బౌద్ధ వారసత్వం, పర్యాటక అవకాశాలపై మరింత సహకారం పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

# తెలంగాణలో ఆయిల్‌పామ్‌కు భారీ ప్రోత్సాహం

## మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఆయిల్‌పామ్ తోటల విస్తరణ, ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ (FFB) లభ్యత, ప్రాసెసింగ్ సామర్థ్యం, క్రూడ్ పామ్ ఆయిల్ (CPO), పామ్ కెర్నల్ ఆయిల్ ఉత్పత్తి, పామ్ గింజల పెంకులు తదితర ఉప ఉత్పత్తుల వినియోగంతో పాటు భవిష్యత్తులో సబ్బులు, ఇతర పామ్ ఆధారిత వినియోగ, పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ వరకు సమగ్ర వ్యవస్థ ఏర్పాటుపై చర్చించినట్లు మంత్రి తెలిపారు.

వరి ఒక్కటే కాదు.. రైతుకు లాభం ఇచ్చే ప్రత్యామ్నాయం కావాలి

తెలంగాణలో సాగునీటి సదుపాయాలు విస్తరించడంతో పెద్దఎత్తున వరి సాగవుతోంది. సాగులో అలవాటు, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థపై ఉన్న భరోసా కారణంగా అనేక ప్రాంతాల్లో వరి ప్రధాన పంటగా మారింది. అయితే విస్తృతమైన వరి సాగు సాగునీటి వనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచడంతో పాటు ప్రతి ఏటా లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లింగ్, నిల్వ వంటి భారీ బాధ్యతను ప్రభుత్వంపై మోపుతోంది.ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతంలో అనిశ్చితి ఈ అవసరాన్ని మరింత స్పష్టంగా చేస్తున్నాయని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది నాగార్జునసాగర్‌కు ఆశించిన స్థాయిలో ప్రవాహాలు రాకపోవడం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (SRSP)తో పాటు పలు మధ్యతరహా ప్రాజెక్టుల్లోనూ నీటి లభ్యత పరిమితంగా ఉండటం వంటి పరిస్థితుల నేపథ్యంలో నీటి వినియోగ సామర్థ్యం కలిగిన, రైతుకు గిట్టుబాటు ఆదాయం అందించే పంటల వైపు వ్యవసాయాన్ని వైవిధ్యీకరించాల్సిన అవసరం ఉందని మంత్రులు పేర్కొన్నారు.

3.12 లక్షల ఎకరాలకు చేరిన ఆయిల్‌పామ్

జాతీయ వంటనూనెల మిషన్--ఆయిల్‌పామ్ (NMEO-OP) అమలులో తెలంగాణ దేశంలో వేగంగా ముందుకు సాగుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది.

సమావేశంలో వెల్లడించిన గణాంకాల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో 3,12,275 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుండగా, 65,691 మంది రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. చీవీజూూ-ూూ అమలుకు ముందు రాష్ట్రంలో సుమారు 46,325 ఎకరాల్లో మాత్రమే ఆయిల్‌పామ్ ఉండగా, మిషన్ కింద అదనంగా 2,65,950 ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఇందుకోసం ఇప్పటివరకు సుమారు రూ.515.84 కోట్లు వ్యయం చేశారు.

ముఖ్యంగా 2023 డిసెంబర్ తర్వాత ఆయిల్‌పామ్ విస్తరణ మరింత వేగం పుంజుకుంది. అప్పటి నుంచి సుమారు 1.29 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి రాగా, దాదాపు రూ.388.99 కోట్లు ఖర్చు చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మరో 21,230 ఎకరాలు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చాయి.

సూర్యాపేటకు ఖమ్మం, కొత్తగూడెం అనుసంధానం

ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలో సుమారు 5,753 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. అయితే భారీ ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అవసరమైన ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్‌ను ఒక్క జిల్లా నుంచే సమకూర్చడం సాధ్యం కాకపోవచ్చని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలో సూర్యాపేటతో పాటు ఖమ్మం, కొత్తగూడెం తదితర అనుకూల జిల్లాల నుంచి ముడిసరుకును సమీకరించే అవకాశాలను అధ్యయనం చేయాలని రిలయన్స్‌ను ప్రభుత్వం కోరింది.

ఆయిల్‌పామ్ తోటల వయస్సు, ఉత్పాదకత, భవిష్యత్ FFB ఉత్పత్తి, సాగు విస్తరణ అవకాశాలు, రవాణా సదుపాయాలు, కలెక్షన్ సెంటర్లు, నర్సరీలు, పామ్ కెర్నల్స్, షెల్స్ లభ్యత తదితర అంశాలను అధ్యయనం చేసిన అనంతరం ప్రతిపాదిత పరిశ్రమ సామర్థ్యం, స్థలాన్ని రిలయన్స్ నిర్ణయించనుంది.

తోట నుంచి పరిశ్రమ వరకు.. దశలవారీ పెట్టుబడులు

ముందుగా ఆయిల్‌పామ్ తోటలు, ముడిసరుకు వనరులను బలోపేతం చేసి, అందుబాటులోకి వచ్చే FFBకు అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించారు. తోటలు పరిపక్వత సాధించి ఉత్పత్తి పెరిగే కొద్దీ పరిశ్రమ సామర్థ్యాన్ని కూడా దశలవారీగా విస్తరించవచ్చని భావిస్తున్నారు.

భవిష్యత్తులో క్రూడ్ పామ్ ఆయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, షెల్స్ తదితర ఉప ఉత్పత్తుల ప్రాసెసింగ్‌తో పాటు సబ్బులు, ఇతర పామ్ ఆధారిత వినియోగ వస్తువులు, పారిశ్రామిక ఉత్పత్తులను తయారు చేసే సమగ్ర ఆయిల్‌పామ్ పారిశ్రామిక సముదాయంగా దీనిని తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలిస్తున్నారు.

30 ఏళ్ల వరకు రైతుకు ఆదాయం

వాణిజ్య నూనె పంటల్లో ఎకరానికి అత్యధిక నూనె దిగుబడి ఇచ్చే పంటల్లో ఆయిల్‌పామ్ ఒకటని అధికారులు వివరించారు. ఒకసారి తోట స్థిరపడిన తర్వాత దాదాపు 30 సంవత్సరాల పాటు రైతుకు ఆదాయాన్ని అందించే సామర్థ్యం దీనికి ఉందని పేర్కొన్నారు.

సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్ ప్రకారం ఒక టన్ను నూనె ఉత్పత్తికి దాదాపు 0.625 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు సరిపోతుందని, సంప్రదాయ నూనెగింజల పంటలతో పోలిస్తే భూ వినియోగ సామర్థ్యం గణనీయంగా ఎక్కువగా ఉంటుందని వివరించారు.

రైతుకు ఆదాయం.. నీటికి పొదుపు.. రాష్ట్రానికి పరిశ్రమ

ఆయిల్‌పామ్ ఆధారిత సమగ్ర వ్యవస్థ బలోపేతమైతే రైతులకు స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు సాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుందని, ప్రతి ఏటా ప్రభుత్వం ఎదుర్కొంటున్న భారీ ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లింగ్, నిల్వ భారాన్ని క్రమంగా తగ్గించేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రస్తుతం తెలంగాణ ఆయిల్‌పామ్ కార్యక్రమంతో 14 కంపెనీలు అనుసంధానమై ఉన్నాయి. జిల్లాల వారీగా ఆయిల్‌పామ్ విస్తీర్ణం, ఉత్పత్తి, సబ్సిడీలు, కంపెనీలకు కేటాయించిన ప్రాంతాలు, భవిష్యత్ ఖీఖీదీ లభ్యతకు సంబంధించిన తాజా సమాచారాన్ని రిలయన్స్‌కు అందించాలని అధికారులను ఆదేశించారు.

రిలయన్స్ ప్రతినిధి బృందం త్వరలో కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాల్లో పర్యటించి ఆయిల్‌పామ్ తోటలు, ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయనుంది.

ఈ ప్రణాళిక కార్యరూపం దాల్చితే కోదాడ--హుజూర్‌నగర్--సూర్యాపేట ప్రాంతం తెలంగాణలో విస్తృతమైన 'ఫార్మ్ టు ఇండస్ట్రీ ఆయిల్‌పామ్ కారిడార్'కు కేంద్రబిందువుగా అవతరించే అవకాశం ఉంది. రైతులకు వరికి గిట్టుబాటు ప్రత్యామ్నాయాన్ని అందించడంతో పాటు, దేశం వంటనూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే జాతీయ లక్ష్యంలో తెలంగాణ మరింత కీలక పాత్ర పోషించనుంది.

# మాజీమంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కలిసిన ముదిరాజ్ నాయకులు

## ముదిరాజ్ హక్కుల గురించి అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడాలని వినతి

!సిద్దిపేట ప్రతినిధి, ముదిరాజులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి ముదిరాజ్ హక్కుల సాధన సమితిముదిరాజులను బీసీ డి నుంచి బీసీ ఏ,లోకి మారుస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆ హామీని నేటికీ అమలు చేయలేదని ముదిరాజ్ హక్కుల సాధన సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమం కోసం చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేశారని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ విషయంలో 10 శాతం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకుండా టెండర్ల ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దీనివల్ల మత్స్యకారుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా గత ప్రభుత్వంలో మత్స్యకారులకు టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలు, చేపలు పట్టే పరికరాలు మరియు ఇతర సామాగ్రి అందించే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులు, ముదిరాజుల కోసం చెప్పుకోదగిన కొత్త సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు.ముదిరాజులకు బీసీ ఏ, రిజర్వేషన్ కల్పించడంతో పాటు మత్స్యకారుల సంక్షేమానికి సంబంధించిన పథకాలను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న హామీలను కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# ఏటూరునాగారంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ను ప్రారంభించిన మంత్రి




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 26 ఏటూరు నాగారం** ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ సమీపంలో మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మండల అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క గారు ప్రారంభించారు

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రేపటి నుంచి గ్రామ సభలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్ ఐ ఆర్ ఓటర్ జాబితాను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు...

బిట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఒ ఎస్ ఐ ఆర్ ములుగు డిస్ట్రిక్ట్ ఇంచార్జి ప్రకాష్ ముఖ్యఅతిథులుగా విచ్చేసినారు

ఈ కార్యక్రమంలో ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న,జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ తాజ్, జిల్లా సెక్రటరీ ఎండీ ఖలీల్ ఖాన్,జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య,ఏటూరునాగారం డివిజన్ ఆత్మ చైర్మన్ కర్ల అరుణ,జూఖఎం వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు,మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల పోషయ్య,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్,టౌన్ అధ్యక్షులు కే రంజిత్,టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్,డైరెక్టర్లు,సర్పంచులు,సీనియర్ నాయకులు,జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ములుగు జిల్లా లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన మంత్రి సీతక్క

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 26 ఏటూరునాగారం**బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో 4 కోట్ల 46 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.



తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం సీఆర్ఆర్--ప్లెయిన్ 2025--26 నిధులతో ఏటూరునాగారం మండలం శివాపూర్ గ్రామంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. శివాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోగుపల్లిలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అనంతరం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ నిధులు 2 కోట్ల 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణంతోపాటు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వేములవాడలో భారీ ర్యాలీ




**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 26:** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి కోరుట్ల బస్టాండ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వం అందరికీ ఆదర్శమని అన్నారు. సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేములవాడ గంగా-జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందని ముస్లిం కమిటీ మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రమ్ అన్నారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీర్ మొహమ్మద్, నవాబ్ ఖాన్, గౌస్ ఉద్దీన్, మహమ్మద్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు

# మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లు

## కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు




మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా మీ సేవా కేంద్రాలు ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా స్వీట్ షాపుల నుంచి టెక్స్ టైల్ స్టోర్స్, నైపుణ్య వృత్తిదారులు, ఇతర చిన్న వ్యాపారులకు డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలను చేరువ చేయవచ్చని వెల్లడించారు. వ్యాపారులు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఈ సేవ ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. మీ సేవా కేంద్రాలు పౌర సేవలకే పరిమితం కాకుండా ప్రజలకు డిజిటల్ అవగాహన కల్పించి, ఆదాయ అవకాశాలను పెంచే వేదికలుగా మారాలని తెలిపారు. కొత్త ఆలోచనలు, సేవలు, వ్యాపార అవకాశాలను తెలంగాణ ఎప్పుడూ స్వాగతిస్తుందని వెల్లడించారు. ప్రజల ఆదాయం, దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఇవి దోహదపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని తొలుత హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ/క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. సుమారు 120 మంది మీ సేవా వీఎల్‌ఈలకు డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ప్రకటనలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారిలో 10 మందికిపైగా ఇప్పటికే ప్రత్యక్ష డిజిటల్ ప్రకటనల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక వ్యాపారులకు ఇప్పటివరకు 17కుపైగా ప్రకటనలను రూపొందించి ప్రచురించారు.

ఈ కార్యక్రమంతో వీఎల్‌ఈలకు కొత్త ఆదాయ మార్గం అందుబాటులోకి వచ్చింది. స్థానిక వ్యాపారులు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేదికల్లో తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసుకునే అవకాశం ఏర్పడింది.

తొలి దశలో మంచి ఫలితాలు రావడంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తున్నారు. రెండో దశలో ప్రతి జిల్లా నుంచి నలుగురు నుంచి ఐదుగురు చొప్పున వీఎల్‌ఈలను ఎంపిక చేశారు. డిజిటల్ మార్కెటింగ్‌పై ప్రాథమిక అవగాహన, ఆసక్తి, స్థానిక వ్యాపారులతో సమర్థంగా సంప్రదించే సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేపట్టారు.

శిక్షణ పొందిన వీఎల్‌ఈలు తమ జిల్లాల్లో 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' పనిచేస్తారు. స్థానిక వ్యాపార అవసరాలను గుర్తించడం, డిజిటల్ మార్కెటింగ్ ప్రయోజనాలను వివరించడం, ప్రకటనల రూపకల్పనలో సహకరించడం, సరైన లక్ష్య వినియోగదారులను గుర్తించడం వంటి సేవలను అందిస్తారు. వ్యాపార విస్తరణలోనూ నిరంతర సహకారం అందించనున్నారు.

మెటాతో ఎంఓయూ

కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ), ఐటీ అండ్ సీ శాఖ, మెటా సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమంలో రెండు సంస్థల భాగస్వామ్యం అధికారికంగా ప్రారంభమైంది.

ఈ కార్యక్రమంలో మీ సేవా కమిషనర్, ఈఎస్‌డీ అధికారి టి.రవికిరణ్, ఐఎఫ్ఎస్, మెటా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ అరుణ్ శ్రీనివాస్, స్ట్రాటజిక్ ప్రోగ్రామ్స్ అండ్ పార్ట్నర్‌షిప్స్ హెడ్ దివ్య ఖేమాని వధేరా, మీడియా, ట్రావెల్ అండ్ సర్వీసెస్ ఎకోసిస్టమ్ వర్టికల్ హెడ్ రిషాద్ చిందమడ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోర్టల్, హెల్ప్‌లైన్ ప్రారంభం

స్థానిక వ్యాపారులు మీ సేవా ద్వారా నేరుగా డిజిటల్ మార్కెటింగ్ సహాయం కోరేలా కొత్త సదుపాయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు.

పోర్టల్: meeseva.telangana.gov.in

టోల్‌ఫ్రీ నంబర్లు: 1100 / 1800–425–1110

ఈ సేవతో వ్యాపారులకు అందుబాటు ధరల్లో డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయి. వినియోగదారులు తమ ప్రాంతంలోని ఉత్పత్తులు, సేవలను సులభంగా గుర్తించగలుగుతారు. వీఎల్‌ఈలకు అదనపు ఆదాయ మార్గం ఏర్పడుతుంది. రాష్ట్రంలో డిజిటల్ వ్యాపార వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.

శిక్షణ పొందిన ప్రతి వీఎల్‌ఈ తొలుత ఒక వ్యాపారంతో పని ప్రారంభించి, ఆ తర్వాత పది, వంద వ్యాపారాలకు సేవలను విస్తరించేలా ముందుకు సాగాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి జిల్లాలో శిక్షణ పొందిన డిజిటల్ మార్కెటింగ్ వీఎల్‌ఈలు అందుబాటులో ఉండాలన్నది లక్ష్యమని వెల్లడించింది. ప్రతి స్థానిక వ్యాపారికి తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రచార సహాయం అందుబాటులోకి తేవాలని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమం అమలులో భాగస్వాములైన ఈఎస్‌డీ--మీ సేవా బృందం, మెటా ప్రతినిధులు, వీఎల్‌ఈల సేవలను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు.

# పేదవాడి ఇంటి కోసం కేంద్రం నిధులు ఇవ్వకపోయినా వెనక్కి తగ్గం

మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి వెల్లడించారు. మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో గురువారం నాడు జమ అవుతాయని తెలిపారు. మిగిలిన వారికి కూడా విడతల వారీగా ఇస్తాం . ఇందులో ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు.

దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి తెలిపారు.

పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఇప్పటికీ ఉన్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.

గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

## జగ్గంపేట గడ్డపై ప్రజా నాయకుడు

### - పాఠం శెట్టి సూర్యచంద్ర జగ్గంపేట మండలం.

జగ్గంపేట నియోజకవర్గం లో ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర అధికార పార్టీ అరాచకాలను, అవినీతిని ఎదిరించి నిలబడుతూ, నిత్యం ప్రజల పక్షాన నిలిచే నిజమైన ప్రజా నాయకుడిగా ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠం శెట్టి సూర్యచంద్రనియోజకవర్గంలో ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు.అధికారంలో ఉన్నవారు ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన వేళ, సూర్యచంద్ర మాత్రం గ్రామ గ్రామం తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకుంటున్నారు. రోడ్లు, తాగునీరు, రైతు సమస్యలు, యువత ఉపాధి వంటి ప్రతి అంశంపైనా అధికార పార్టీని నిలదీస్తూ, ప్రశ్నిస్తూ ప్రజల గొంతుకగా మారారు.అక్రమ మట్టి తరలింపుపై పోరాటం గతంలో టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అనుచరులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కి సూర్యచంద్ర నేరుగా ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రకృతి సంపదను కాపాడటం కోసం ఆయన చేసిన ఈ పోరాటానికి ప్రజల నుండి విశేష మద్దతు లభిస్తోంది.రైతుల పక్షాన అండగా రైతుల కష్టాలను చూసి చలించిపోయే సూర్యచంద్ర వారి పక్షాన నిత్యం పోరాడుతున్నారు. రైతులకు అండగా నిలబడి, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.యువతకు ఆదర్శంగా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న యువతకు మార్గదర్శనం చేస్తూ, వారిలో భరోసా నింపుతున్నారు. కులం, మతం, పార్టీకి అతీతంగా అందరినీ కలుపుకుపోయే ఆయన మనస్తత్వమే ఆయన్ను నిజమైన ప్రజా నాయకుడిగా నిలబెట్టింది.నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడే తత్వం ఆయన సొంతం. ఆపద అంటే ఆదుకునే అండగా, కష్టం అంటే భుజం తట్టే ఆత్మీయుడిగా జగ్గంపేట ప్రజలు ఆయన్ను "ప్రజా మనిషి గా పిలుచుకుంటున్నారు. "పదవి కోసం కాదు, ప్రజల కోసం" అనే నినాదంతో పోరాడుతున్న సూర్యచంద్ర జగ్గంపేటకు నిజమైన భవిష్యత్తు అని ప్రజలు బలంగా నమ్ముతున్నారు.

# కేరళలో ట్రీట్ మెంట్ కు పవన్...

## పొలిటికల్ స్టైల్ కు మారలేకపోతున్న జనసేనాని



విజయవాడ, ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశాలకు వరుసగా గైర్హాజరవుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి తర్వాత కేబినెట్‌లో కీలక స్థానం కలిగిన డిప్యూటీ సీఎం తరచూ సమావేశాలకు దూరంగా ఉండటం.. ప్రభుత్వ పరిపాలనపై, జనసేన పాత్రపై ప్రతిపక్షాలకు విమర్శలు చేసే అవకాశం కల్పిస్తోంది.పవన్ కల్యాణ్ గైర్హాజరీకి ప్రధాన కారణం ఆయన ఆరోగ్య పరిస్థితేనన్న చర్చ సాగుతోంది. గతంలో ఎదురైన గాయాలు, వెన్ను సంబంధిత సమస్యలు, అనారోగ్య సమస్యల కారణంగా ఆయనకు అప్పుడప్పుడు విశ్రాంతి అవసరమవుతోందని తెలుస్తోంది.రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత నిరంతర పర్యటనలు, ప్రజా కార్యక్రమాలు, అధికారిక సమీక్షలు, పార్టీ వ్యవహారాలతో పాటు దీక్షలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా ఆయనపై శారీరక ఒత్తిడిని పెంచుతున్నాయి.ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ.. పాలనకు నిరంతర అందుబాటు కూడా కీలకమే. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో విధానపరమైన నిర్ణయాలు, శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరుగుతాయి కాబట్టి గైర్హాజరు రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంటోంది.పవన్ కల్యాణ్ రాజకీయ బాధ్యతలతో పాటు గతంలో ఒప్పుకున్న సినిమాల షూటింగ్‌లను పూర్తి చేస్తున్నారు. దీంతో ఆయన షెడ్యూల్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడుతోందన్న అభిప్రాయం ఉంది.ఒకవైపు సినిమా షూటింగ్‌లు, మరోవైపు మంత్రిగా పర్యటనలు, సమీక్షలు, పార్టీ కార్యక్రమాలు కొనసాగితే విశ్రాంతికి సమయం తగ్గిపోవడం సహజం. గతంలో సినిమా రంగంలో ఉన్న ఫ్లెక్సిబుల్ షెడ్యూల్‌కు భిన్నంగా.. ప్రభుత్వ వ్యవహారాల్లో నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంటుంది.ఇక్కడే పవన్‌కు అసలు సవాలు ఎదురవుతోంది. సినిమా, రాజకీయాలు రెండింటినీ సమన్వయం చేయడం కంటే.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరిపాలనకు ప్రాధాన్యత ఇవ్వడం ఇప్పుడు మరింత అవసరం.పవన్ కల్యాణ్‌కు అప్పగించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతో నేరుగా సంబంధం ఉన్న కీలక శాఖలు. ఈ శాఖల్లో విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాల్సి ఉంటుంది.కేబినెట్ సమావేశాలకు వరుసగా దూరంగా ఉండటం వల్ల నిర్ణయ ప్రక్రియలో జనసేనకు సంబంధించిన రాజకీయ ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందనే చర్చ కూడా జరుగుతోంది. అయితే దీనిని పవన్ శాఖల పనితీరుతో నేరుగా ముడిపెట్టే ముందు.. ఆయన గైర్హాజరీకి ఉన్న వాస్తవ కారణాలు, శాఖల పనితీరు వంటి అంశాలను విడిగా చూడాల్సి ఉంటుంది.ఆరోగ్య సమస్యలు నిజంగా ఉంటే వాటి నుంచి పూర్తిగా కోలుకోవడం మొదటి ప్రాధాన్యత. అదే సమయంలో సినిమా కమిట్‌మెంట్లను ఒక దశలో ముగించి, రాజకీయ బాధ్యతలకు స్పష్టమైన సమయాన్ని కేటాయించడం అవసరం.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి నిరంతరం పనిచేసే నాయకుడితో కలిసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నేపథ్యంలో పవన్ తన పాత్రను మరింత స్పష్టంగా, నిరంతరంగా చూపించాల్సిన అవసరం ఉంది.కేబినెట్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం, శాఖలపై ప్రత్యక్ష పర్యవేక్షణ పెంచడం, ప్రభుత్వ నిర్ణయాల్లో చురుకైన భాగస్వామ్యం చూపించడం ద్వారా ప్రస్తుతం వినిపిస్తున్న విమర్శలకు సమాధానం చెప్పవచ్చు.పవన్ కల్యాణ్‌కు ఇప్పుడు అసలు పరీక్ష రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కాదు.. ఆరోగ్యం, సినిమా, ప్రభుత్వం అనే మూడు బాధ్యతల మధ్య సరైన సమతుల్యత సాధించడమే.

# ఉద్యోగ సంఘాల మధ్య ఆధిపత్య పోరు

గుంటూరు ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన సంఘాల్లో అంతర్గత ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఉద్యోగ వర్గాల్లో బలమైన పట్టు కోసం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ మధ్య తీవ్రమైన పోటీ వాతావరణం నెలకొంది. పెండింగ్ డీఏలు , పే రివిజన్ కమిషన్ నియామకం, పాత పెన్షన్ స్కీమ్ , పెండింగ్ బిల్లుల విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తూ ఇరు నేతలు మీడియా వేదికగా బలప్రదర్శనకు దిగుతున్నారు. ఉద్యోగుల పక్షాన తామే అసలైన గొంతుకగా నిలుస్తున్నామనే ముద్ర వేయించుకునేందుకు సాగుతున్న ఈ ప్రయత్నం సంఘాల మధ్య ఐక్యతను దెబ్బతీస్తోంది.క్షేత్రస్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కంటే సంఘాల రాజకీయ మైలేజీకే నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ముందు విడివిడిగా వినతిపత్రాలు సమర్పించడం, విడివిడిగానే ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం ద్వారా ఉద్యోగులను రెండు వర్గాలుగా విభజిస్తున్నారనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియామకం, డీఏ బకాయిలపై ఎవరు ముందుగా ప్రభుత్వాన్ని ఒప్పించారనే క్రెడిట్ కొట్టేయడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పావులు కదుపుతున్నాయి. ప్రభుత్వ పెద్దలతో ఎవరు సన్నిహితంగా ఉంటూ ఉద్యోగుల పనులు చేయిస్తారనే పోటీ కూడా వీరి ఆధిపత్య సమరానికి మరింత ఆజ్యం పోస్తోంది.ఈ నాయకుల వ్యక్తిగత ప్రతిష్ట, అంతర్గత రాజకీయాల కారణంగా అసలు ఉద్యోగుల ప్రయోజనాలు గాల్లో దీపంలా మారుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆయా సమయాల్లో ప్రభుత్వానికి అనుకూలంగానో లేదా ఉద్యమాలను నీరుగార్చేలానో వ్యవహరించారనే ఆరోపణలు ఇప్పటికే ఇరు నేతలపై ఉన్నాయి. గతంలో ఉమ్మడి పోరాటాలతో ప్రభుత్వాలను కదిలించిన చరిత్ర కలిగిన ఉద్యోగ సంఘాలు, నేడు కేవలం నాయకుల ఉనికి, భవిష్యత్ రాజకీయ ఆకాంక్షల కోసం వేర్వేరు కుంపట్లు పెట్టుకోవడం సాధారణ ఉద్యోగుల్లో తీవ్ర నిరాశను నింపుతోంది.ఒకే డిమాండ్ కోసం విడివిడిగా ఉద్యమాలు చేయడం వల్ల ప్రభుత్వానికి సాకులు చెప్పుకునే అవకాశం దక్కుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. నాయకులు తమ వ్యక్తిగత రాజకీయాలను, ఆధిపత్య పోరును పక్కన పెట్టి ఐక్య కార్యాచరణతో ముందుకు రాకపోతే ఉద్యోగుల హక్కులు సాధించుకోవడం మరింత క్లిష్టంగా మారుతుందని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం వైసీపీ హయాంలో ఉద్యోగ సంఘాలు చేసిన విన్యాసాలను చూసిన తర్వాత అసలు వారి డిమాండ్లను పట్టించుకోవడం లేదు. తాము చేయాలనుకున్నదే చేస్తోంది.

## టీడీపీ సోషల్ మీడియా టాస్క్

## టార్గెట్ జెన్ జీ, ఆల్ఫా

ఒంగోలు, ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పాలనతో పాటు ప్రజలతో సమాచార సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా యువతను చేరుకోవడానికి సోషల్ మీడియాను సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువతలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి చేరువ చేయాలన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది.ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ఎంత కీలకంగా మారిందో పలు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో రాజకీయ చర్చలు ఎక్కువగా డిజిటల్ వేదికలపైనే జరుగుతున్నాయి. ఒక అంశంపై ప్రజాభిప్రాయాన్ని వేగంగా ప్రభావితం చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా ప్రజలకు వివరించేందుకు కూడా సోషల్ మీడియా ఉపయోగపడుతోంది. ఈ మార్పును గుర్తించిన బీజేపీ కూడా డిజిటల్ ప్రచారంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా వ్యవస్థను మరింత చురుగ్గా మార్చాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కొంతమంది మంత్రుల డిజిటల్ కార్యకలాపాలపై చంద్రబాబు వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంగలపూడి అనిత , ఫరూక్ , కొండపల్లి శ్రీనివాస్ (తదితరులు తమ కార్యక్రమాలు, ప్రజా సంబంధిత విషయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారని చర్చ జరిగింది.అయితే ఇంతటితో సరిపోదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలతో నిర్వహిస్తున్న సమావేశాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను డిజిటల్ మాధ్యమాల ద్వారా వివరించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఒకే వేదికకు పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన చెప్పినట్లు సమాచారం.ముఖ్యంగా వచ్చే రెండేళ్లలో యువ ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరగనుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతకు ప్రభుత్వం ఏం చేస్తోంది, ఉపాధి, విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో ఎలాంటి అవకాశాలు కల్పిస్తోంది అనే విషయాలను వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన 'జగన్ 2.0' యాప్ కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. డిజిటల్ వేదికల ద్వారా ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించే విషయంలో రాజకీయ నాయకులు మరింత ముందుండాలని చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రశ్నిస్తే స్పందించడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం, చేసిన పనులను పారదర్శకంగా వివరించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.అయితే సోషల్ మీడియాపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రధాన మీడియాకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. టెలివిజన్, పత్రికలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా.. అన్ని వేదికలను సమన్వయంతో ఉపయోగించినప్పుడే ప్రభుత్వ సందేశం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తుందని భావిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వం డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేసి యువతతో ప్రత్యక్ష సంబంధం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది

# ఎన్నికల కోసం... పార్టీల వ్యూహాలు

నెల్లూరు, ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలు ఆసక్తిని పెంచుతున్నాయి. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జనసేన భారతీయ జనతా పార్టీ ఇప్పటికే ఎన్నికలపై దృష్టి పెట్టాయి. మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లోనూ ఇదే సమన్వయాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.సీట్ల పంపకమే ఇప్పుడు కూటమి లో ప్రధాన అంశంగా మారనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ బలాన్ని చాటుకున్న జనసేన, బీజేపీలు స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను ఆశించడం సహజమే. అయితే నియోజకవర్గాలు, స్థానిక పరిస్థితులు, పార్టీకి ఉన్న బలం, అభ్యర్థుల సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించి టీడీపీతో కలిసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. డిమాండ్లు ఎన్ని ఉన్నా చివరికి మూడు పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి ఎన్నికలను ఎదుర్కొంటాయని కూటమి నేతలు భావిస్తున్నారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయాన్ని దృష్టిలో పెట్టుకుంటే స్థానిక పోరు కూడా ప్రతిపక్షానికి పెద్ద సవాలుగా మారనుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పునకు కారణమైంది. ఇప్పుడు అదే ఐక్యతను గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు కొనసాగించడం కూటమికి ముఖ్యమైన అంశంగా మారింది.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోందన్న ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన ఆ పార్టీకి స్థానిక ఎన్నికలు తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశం కావచ్చని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలో విభేదాలు వస్తాయని గతంలో చేసిన అంచనాలు ఫలించకపోవడంతో ఇప్పుడు కొత్త వ్యూహంతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి వైసీపీకి ఏర్పడింది.కొంతకాలం క్రితం వామపక్ష పార్టీలతో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించాలనే ఆలోచన కూడా తెరపైకి వచ్చింది. అయితే ఆ స్థాయిలో రాజకీయ అవగాహన ముందుకు సాగలేదు. వామపక్షాలు తమ కార్యక్రమాలతో కొనసాగుతుండగా, వైసీపీ కూడా తన రాజకీయ మార్గంలోనే పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.స్థానిక ఎన్నికలను 2024 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చకూడదని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల కాలంలో రాజకీయ పరిస్థితులు మారాయని, ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. తమకు గతంలో బలమైన పట్టు ఉన్న ప్రాంతాలను నిలబెట్టుకోవడంతో పాటు కూటమికి అనుకూలంగా వెళ్లిన కొన్ని స్థానాల్లో తిరిగి పుంజుకోవాలని వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే స్థానిక ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నంగా ఉంటాయి. అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, గ్రామ స్థాయి సంబంధాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఈసారి ఎవరి అంచనాలు ఎంతవరకు నిజమవుతాయన్నది ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టమవుతుంది.మొత్తానికి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి వర్సెస్ వైసీపీ మధ్య ప్రధాన పోరుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, ఇతర రాజకీయ సంస్థలు పోటీ చేసినా ప్రధాన రాజకీయ దృష్టి మాత్రం ఈ రెండు శిబిరాలపైనే ఉండనుంది. 2024లో కూటమికి వచ్చిన భారీ ఓటు మద్దతును అది ఎంతవరకు నిలబెట్టుకుంటుందో, వైసీపీ తన ఓటు శాతాన్ని ఎంతవరకు పెంచుకుంటుందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.

### తెరపైకి కులం కార్డు...

వైసీపీ నేతలు కుటుంబ వివాదాలకు, చేసిన నేరాలకు కులం రంగు పులుముకుంటున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును, అతని కుమారుడిని ఈడీ అరెస్టు చేసింది. లిక్కర్ రవాణా టెండర్లలో వందల కోట్ల అక్రమాలు, దొంగ ఇన్‌వాయిస్‌లు, లగ్జరీ ఆస్తుల కొనుగోలుపై ఆధారాలతో దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంటే? దానికి రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రాజకీయ కక్ష సాధింపులకు గానీ ముడిపెడుతూ బీసీ రంగు ఎ ౕ ్ర లి వి ం బయటపడాలనుకుంటున్నారు.మరొకవైపు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దానయ్య అనే నిరుపేద గొర్రెల కాపరి బీసీ కాదా? ఆ నిరుపేద కుటుంబానికి కనీస సానుభూతి తెలపకపోగా, నిందితుడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఏ తరహా బీసీ ఉద్ధరణకు సంకేతం? బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాల్సింది పోయి, కేసును నీరుగార్చే ప్రయత్నం చేసిన నేతలకు బీసీల పట్ల నిజమైన ప్రేమ ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేరం చేసింది తమ వర్గం వారైతే ఒక న్యాయం, నిరుపేదలు బాధితులైతే మరో న్యాయమా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.ఇక మరో నేత జోగి రమేష్ వ్యవహారంలోనూ ఇదే తీరు కనిపిస్తోంది. క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన వ్యక్తి సామాజిక మూలాలను పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకుంటున్నారు. కుటుంబ వివాదంలో.. తమ కోడలికి అన్యాయం చేశారన్నది బహిరంగ నిజం. మరి ఆమె బీసీ బిడ్డ కాదా?. కుటుంబాన్ని సక్రమంగా ఉంచుకోలేక బీసీ అని కేకలేస్తే పనవుతుందా? .ఆర్థిక అక్రమాలు, తీవ్రమైననేరాలు , నిరుపేదల ప్రాణాలు తీసిన సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు విచారణ ఎదుర్కొనాల్సిందే. కేవలం వైఎస్సార్‌సీపీలో ఉంటేనే బీసీలు అవుతారా? ఇతర పార్టీల్లోని వారు, సాధారణ ప్రజలు బీసీలు కాదా? చేసిన తప్పుల తీవ్రతను కప్పిపుచ్చుకోవడానికి కులాన్ని, మతాన్ని కేడర్‌గా వాడుకోవాలనుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పుడు కులం వెనుక దాక్కోవాలనుకోవడం రాజకీయ చేతకానితనం అవుతుంది. కానీ వైసీపీ నేతలకు తెలిసిన విద్య అదే.

# బెజవాడ బరిలో వారసులు

విజయవాడ, ఆగస్టు 26, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి క్రమంగా పెరుగుతోంది. అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన , భారతీయ జనతా పార్టీ తమ తమ వ్యూహాలతో ఎన్నికల సన్నాహకాల్లో నిమగ్నమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ పదవులతో పాటు పట్టణ ప్రాంతాల్లో మేయర్, చైర్‌పర్సన్ స్థానాలపై రాజకీయ పార్టీల దృష్టి ఎక్కువగా ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మేయర్ పీఠాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు.ఈ క్రమంలో విజయవాడ మేయర్ పదవికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్ర రాజకీయాల్లో విజయవాడకు ఉన్న ప్రాముఖ్యత, అమరావతి కి సమీపంలో ఉండటం, నగరంలో ఉన్న రాజకీయ చైతన్యం కారణంగా ఇక్కడి మేయర్ స్థానం కోసం పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అయితే ఈసారి పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని నగర పాలనపై పట్టు సాధించాలని టీడీపీ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.మేయర్ పదవి కోసం టీడీపీలో ఇప్పటికే పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో రాజకీయ కుటుంబాలకు చెందిన వారసుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి వరుసగా విజయం సాధించిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కుటుంబం నుంచి కూడా ఒక పేరు చర్చకు వస్తోంది. తన కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకురావడానికి మేయర్ పదవి మంచి వేదికగా ఉంటుందని బోండా ఉమా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఇటీవల బోండా కుమారుడు రాజకీయ అంశాలపై స్పందిస్తూ మీడియా ముందుకు రావడం కూడా ఈ ఊహాగానాలకు బలం ఇచ్చింది. దీంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయవాడ మేయర్ ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని టీడీపీ పరిశీలిస్తే, బోండా కుటుంబానికి అవకాశం దక్కవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.మరోవైపు విజయవాడ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న వంగవీటి కుటుంబం ఎ) పేరు కూడా తెరపైకి వస్తోంది. వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ కొంతకాలంగా రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గతంలో విశాఖపట్నంలో నిర్వహించిన రంగానాడు కార్యక్రమం ద్వారా ఆమె రాజకీయంగా చర్చలోకి వచ్చారు. ఆమె జనసేన వైపు వెళ్తారనే ప్రచారం కూడా గతంలో జరిగింది.అయితే ఇప్పుడు ఆశా కిరణ్‌ను టీడీపీలోకి తీసుకువచ్చి విజయవాడ మేయర్ అభ్యర్థిగా నిలబెట్టే ఆలోచన ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.

వంగవీటి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కాపు సామాజిక వర్గాన్ని మరింత దగ్గర చేసుకునే వ్యూహంలో భాగంగా దీనిని చూడవచ్చని విశ్లేషణలు సాగుతున్నాయి. ఇప్పటికే వంగవీటి రాధాకృష్ణ టీడీపీలో కొనసాగుతున్నారు.మేయర్ పీఠం కోసం పోటీ పడుతున్న పేర్లు, సామాజిక సమీకరణాలు, రాజకీయ వారసుల ప్రవేశం వంటి అంశాలు ఎన్నికల సమయానికి మరింత స్పష్టత పొందే అవకాశం ఉంది. చివరకు పార్టీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. విజయవాడ మేయర్ ఎన్నిక కేవలం ఒక నగర పాలక సంస్థ పోరుగా కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం చూపించే పోటీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## భాగ్యలక్ష్మి కాలనీ లో గంజాయి మత్తులో యువకుల వీరంగం

కుత్బుల్లాపూర్ భాగ్యలక్ష్మి కాలనీ లో గంజాయి మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. సీసీటీవీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డు అయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న ర్యాపిడో కార్ డ్రైవర్ని ఆపి గంజాయి కావాలంటూ పది మంది రచ్చ చేసారు. గంజాయి నా వద్ద లేదనడంతో ఆగ్రహానికి గురై మత్తులో డ్రైవర్ ఆకాష్పై బీర్ సీసాలతో విచక్షణారహితంగా దాడి చేసారు. గంజాయి యువకుల దాడిలో కార్ డ్రైవర్ ఆకాష్ తలకు తీవ్ర గాయాలతో పాటు చేయి విరిగింది. దాడి ఘటనలో దెబ్బలు తట్టుకోలేక పక్కనే ఉన్న తన రూమ్కి పరిగెత్తాడు. తరుముకుంటూ వెళ్లి డ్రైవర్ ఇంటి ఆవరణలో కట్టెలతో విచక్షణారహితంగా దాడికి దిగారు.

# జోగి ఫ్యామిలీ అడ్డంగా బుక్...

విజయవాడ, ఆగస్టు 26, మాజీ మంత్రి జోగి రమేష్ తన కుటుంబాన్ని రాజకీయాల కోసం వీధిన పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కోడలిని కుమార్తె కంటే బాగా చూసుకున్నానని ప్రకటించారు. ఇదంతా కల్పితం మాత్రమేనని.. దీని వెనుక చంద్రబాబు, లోకేష్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నారని.. పెద్ద పెద్ద వారి కుటుంబాల్లోనే వివాదాలు ఉన్నాయని.. తన కుటుంబంలో కేవలం తన కుమారుడు, కోడలి మధ్య విభేదాలు మాత్రమేనని.. తమ కోడలి ఫిర్యాదు కంటే ముందే తాము విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు నిన్ననే జోగి రమేష్ మీడియా ముఖంగా ప్రకటన చేశారు. నెల రోజులుగా క్షోభ అనుభవిస్తున్నామని చెప్పుకొచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ జోగి రమేష్ కోడలు మేఘన, ఆమె తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించే ప్రయత్నం చేశారు.తనకు అత్తవారింట్లో ఎదురైన పరిణామాల గురించి వివరిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు మేఘన. సంసారానికి పనికిరాని లోపం కొడుకు జోగి రాజీవ్ కు ఉందని తెలిసి.. కేవలం పరువు, భారీ కట్నం కోసమే తమకు అబద్ధాలు చెప్పి మోసపూరితంగా పెళ్లి చేస్తారని మేఘన కుండబద్దలు కొట్టారు. మరింత అదనపు కట్నం తెస్తేనే నీ నీ భర్తకు ఫీలింగ్స్ వస్తాయి.. నువ్వు సంతోషంగా ఉంటావు అంటూ జోగి రమేష్ భార్య శకుంతల తనను చిత్రహింసలకు గురి చేసిందని మేఘన చెప్పారు. బయట సమాజానికి హిందూ సంప్రదాయ కుటుంబం గా బిల్డప్ ఇచ్చే జోగి రమేష్ ఇంట్లో.. అసలు స్వరూపం వేరని.. వారిది పక్కా క్రిస్టియన్ కుటుంబమని మేఘన ఆధారాలతో సహా బయటపెట్టారు.కొత్తగా అత్తవారింట్లో అడుగుపెట్టిన తనకు పూజ చేసేందుకు ప్రత్యేకమైన గది కూడా లేదని.. తాను హిందూ దేవుళ్ళ ఫోటోలు పెట్టి పూజలు చేస్తుంటే అడ్డుకునేవారని కొచ్చారు. హారతి పళ్లాలు, అగరబత్తులను నేలకేసి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అత్త హిందూ దేవుళ్లను అసభ్యంగా దూషిస్తూ.. బలవంతంగా మతం మార్చేందుకు విపరీతంగా ఒత్తిడి చేశారని ఆరోపించారు. పెళ్లయిన కేవలం రెండు నెలలకి తనను వదిలించుకునే కుట్రతో జోగి రాజీవ్ కోర్టులో రహస్యంగా పిటిషన్ దాఖలు చేశాడు అన్న సంచలన విషయాన్ని కూడా ఆమె వెల్లడించారు. వివాహ సమయంలో కేజీన్నర బంగారం, కోట్లాది రూపాయల ఆస్తులు ఇచ్చినా.. తమ కుమార్తెను అంతమొందించేందుకు ప్రయత్నించారని మేఘన తండ్రి మీడియా ముందు కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు.మరోవైపు న్యాయం కోసం తాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వాన్ని కలిశామని కూడా చెప్పుకొచ్చారు. జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ప్రయత్నం చేస్తే ఆయన పెద్దగా ఆసక్తి చూపలేదని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి పరిస్థితిని వివరిస్తే ఆయన సమస్యను పరిష్కరించడం మానేసి కాలయాపన చేస్తూ రాజీ కుట్రలకు పాల్పడ్డారు. అన్ని దారులు మూసుకుపోవడంతో.. గత్యంతరం లేక స్థానిక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నామని.. జోగి రమేష్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తమపై టిడిపి ముద్ర వేసి రాజకీయ రంగు పులిమారని మేఘన నిప్పులు చెరిగారు. అయితే ఇప్పుడు అసలు విషయం బయటకు రావడంతో జోగి రమేష్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జోగి రమేష్ ఫ్యామిలీ ది ఘోరమైన మోసం అని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు.

# 11 విమానశ్రయాల అభివృద్ధికి పీపీపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 26, దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న సంగతి తెలిసిందే. అందుబాటు ధరల్లో ప్రయాణాలు చేసే అవకాశం కల్పించడం, పెరుగుతున్న ఆదాయం, బిజీ షెడ్యూల్స్ ఏదైనా కారణం కావొచ్చు కాలం గడుస్తున్న కొద్దీ విమానాశ్రయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా విమానాశ్రయాల్లో మౌలిక వసతుల్ని మరింత అభివృద్ధి చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తిరుపతి, వారణాసి సహా మొత్తం 11 విమానాశ్రయాల్ని ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రతిపాదన సిద్ధమైంది. ఆగస్ట్ 4న జరిగిన పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. సుమారు 50 ఏళ్ల రాయితీ కాలానికి ప్రైవేట్ ఆపరేటర్లకు ఈ ఎయిర్‌పోర్టుల్ని అప్పగించాలని కేంద్రం యోచిస్తోంది.ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ 11 విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణ కోసం ప్రైవేట్ సంస్థలు దాదాపు రూ. 8622 కోట్ల మేర పెట్టుబడుల్ని పెట్టాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ విమానాశ్రయాల్ని మొత్తం 5 బండిల్స్‌గా విభజించి, ప్రతి బండిల్‌ను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. దీంట్లో భువనేశ్వర్- హుబ్బళ్లి బండిల్‌కు అన్నింటికంటే ఎక్కువగా రూ. 2725 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. వారణాసి- గయా- కుషీనగర్ బండిల్‌కు రూ. 2467 కోట్లు, రాయ్‌పూర్- ఔరంగాబాద్‌కు రూ. 1496 కోట్ల పెట్టుబడి పడుతుందని తెలుస్తోంది. ఇక తిరుపతి- తిరుచిరాపల్లి ఒక బండిల్‌లో ఉండగా వీటి విస్తరణకు రూ. 1411 కోట్లు పడుతుందని అంచనా వేస్తున్నారు. చివరగా అమృత్‌సర్- కాంగ్రా బండిల్‌కు రూ. 523 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. ఈ విధానంలో పెద్ద విమానాశ్రయాల్ని చిన్న ఎయిర్‌పోర్ట్స్‌తో కలిపి ఒక బండిల్‌గా రూపొందిస్తున్నారు. విమానాశ్రయాల నిర్వహణ మొత్తం కొద్ది సంస్థల చేతుల్లోనే ఉండకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఒకే బిడ్డర్‌కు ఎన్ని విమానాశ్రయ బండిల్స్ ఇవ్వాలనే అంశంలో పరిమితి విధించాలని నిర్ణయించింది. ఇక్కడ ఒకే సంస్థకు ఎక్కువ ప్రాజెక్టులు దక్కితే భారీగా అప్పులు చేయడం వల్ల ఎదురయ్యే ఆర్థిక సమస్యల్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే ఒకే సంస్థకు ఎన్ని బండిల్స్ ఇవ్వాలనే విధానంపై ఇంకా తుది నిర్ణయం మాత్రం తీసుకోలేదు. ప్రైవేట్ సంస్థలకు అప్పగించిన తర్వాత ఇప్పటికే ఆమోదం పొందిన మూలధన వ్యయంతో పాటు విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన అదనపు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.గతంలో 2019లో కూడా విమానాశ్రయాల ప్రైవేటీకరణకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అప్పుడు 6 విమానాశ్రయాల్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు బిడ్డింగ్ నిర్వహించగా, అదానీ గ్రూప్ అన్ని విమానాశ్రయాల్ని దక్కించుకుంది. ఇదే సమయంలో ఇప్పుడు దేశీయ విమాన ప్రయాణానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్, ఢిల్లీ విమానాశ్రయాల విస్తరణకు కూడా భారీ పెట్టుబడులు వస్తున్నాయి. హైదరాబాద్ విమానాశ్రయం విస్తరణ కోసం సుమారు రూ. 13800 కోట్లు, ఢిల్లీ విమానాశ్రయం కోసం రూ .5600 కోట్లు పెట్టుబడులు పెట్టే ప్రణాళికలు ఉన్నాయి

# స్మార్ట్ కార్డుల పై క్రెడిట్ వార్

నల్గోండ ఆగస్టు 26, తెలంగాణలో కొత్తగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ వివాదం ముదురుతోంది. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్.. కేంద్రం ఖఓఉఐంజ కింద భారీగా సబ్సిడీ భరిస్తున్నప్పటికీ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో ఎందుకు పెట్టడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తెలంగాణలో సన్నబియ్యం పంపిణీకి తాము కూడా భారీగా నిధులు వెచ్చిస్తున్నామని స్పష్టం చేస్తోంది.రేషన్ బియ్యం విషయంలో కేంద్రం, రాష్ట్రం రెండింటికీ ఆర్థిక బాధ్యతలు ఉన్నాయి. జాతీయ ఆహార భద్రతా చట్టం, ఖఓఉఐంజ కింద పేదలకు అందించే ధాన్యంపై కేంద్ర ప్రభుత్వం భారీ సబ్సిడీని భరిస్తోంది. అదే సమయంలో లబ్ధిదారుల గుర్తింపు, ధాన్యం రవాణా, నిల్వ, రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ వంటి వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి కీలక పాత్ర ఉంది.తెలంగాణ ప్రభుత్వం కేంద్రం అందించే కోటాకు అదనంగా లబ్ధిదారులకు సన్నబియ్యం అందించేందుకు సొంత నిధులు ఖర్చు చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారు. దీంతో మొత్తం రేషన్ వ్యవస్థకు సంబంధించిన ఖర్చును పూర్తిగా కేంద్రానిదే లేదా పూర్తిగా రాష్ట్రానిదే అని చెప్పడం వాస్తవ పరిస్థితిని సరళీకరించినట్లే అవుతుంది.కేంద్రం సన్నబియ్యం వ్యయాన్ని పూర్తిగా భరిస్తే ప్రధాని మోదీ ఫొటో పెట్టేందుకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కేంద్రం మాత్రం వేల కోట్ల రూపాయల మేర నిధులు, సబ్సిడీలు అందిస్తున్నప్పుడు తమ పాత్రను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని వాదిస్తోంది.కానీ ఇక్కడ మరో కీలకమైన ప్రశ్న తలెత్తుతోంది. ప్రజల కోసం ఖర్చు చేస్తున్న ప్రజాధనంతో అందించే సంక్షేమ పథకాలకు రాజకీయ నాయకుల ఫొటోలు అవసరమా?రేషన్ కార్డు అనేది పేదల ఆహార హక్కుతో ముడిపడిన అధికారిక పత్రం. అది ఏ పార్టీకి చెందిన ప్రచార సాధనం కాదు. సంక్షేమ పథకాలపై రాజకీయ నేతల ఫొటోల కోసం కేంద్రం, రాష్ట్రం పోటీ పడటం కంటే.. ఆ పథకాల ప్రయోజనం ప్రజలకు ఎంత సమర్థంగా చేరుతుందన్నదే ముఖ్యం.రేషన్ బియ్యం కోట్లాది కుటుంబాల జీవితాలను నేరుగా ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ పథకం ద్వారా రాజకీయ మైలేజ్ పొందాలని కేంద్రం, రాష్ట్రంలోని అధికార పార్టీలు రెండూ కోరుకోవడం సహజమే.బియ్యం వెనుక ప్రధాని మోదీ ప్రభుత్వం ఉందన్న సందేశం బలంగా వెళ్తే బీజేపీకి ప్రయోజనం. అదే సమయంలో సన్నబియ్యం, అదనపు కోటా, పంపిణీ వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటే కాంగ్రెస్‌కు రాజకీయ లాభం.అందుకే బియ్యం కంటే 'క్రెడిట్' పెద్ద అంశంగా మారుతోంది.కిషన్ రెడ్డి ప్రతిపాదించినట్లుగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కేంద్రం నేరుగా రేషన్ పంపిణీ చేయడం కూడా ఆచరణలో అంత సులభమైన విషయం కాదు. రేషన్ వ్యవస్థ అనేది కేవలం బియ్యం సరఫరా కాదు. లబ్ధిదారుల డేటా, రవాణా, గోదాములు, రేషన్ డీలర్ల వ్యవస్థ, స్థానిక పర్యవేక్షణ వంటి అనేక అంశాలతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ. కేంద్రం సమాంతరంగా మరో పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో కొత్త సమస్యలకు దారితీసే అవకాశం ఉంది.కేంద్రం ఎంత ఖర్చు చేస్తోంది? రాష్ట్రం ఎంత భరిస్తోంది? కార్డుపై ఎవరి ఫొటో ఉండాలి? అనే రాజకీయ వాదనల మధ్య అసలు లబ్ధిదారుడి సమస్య పక్కకు వెళ్లకూడదు.పేదలకు బియ్యం సకాలంలో అందుతోందా? నాణ్యత ఎలా ఉంది? అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ చేరుతోందా? పంపిణీలో పారదర్శకత ఉందా? ఇవే ప్రధాన ప్రశ్నలు కావాలిరేషన్ కార్డుపై ఎవరి ఫొటో ఉన్నా.. ప్రజలకు కావాల్సింది రాజకీయ ప్రచారం కాదు, తమ హక్కుగా అందాల్సిన నాణ్యమైన ఆహారం.అందుకే ఈ వివాదంలో గెలవాల్సింది కేంద్రం కాదు, రాష్ట్రం కాదు. లబ్ధిదారుడే గెలవాలి.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

## కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు.. ఆరుగురు స్పాట్ డెడ్

హైదరాబాద్, ఆగస్టు 26, హైదరాబాద్?విజయవాడ హైవేపై కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐరన్ రాడ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 20 మందికి తీవ్రంగా గాయపడ్డారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.హైదరాబాద్- విజయవాడ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ముందు వెళ్తున్న కంటైనర్ డీసీఎంను వాహనాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి ఏలూరుకు అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బయల్దేరింది. బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉండగా.. సూర్యాపేటకు చేరుకోగా డ్రైవర్ ఛేంజ్ అయ్యారు. ఆ తర్వాత బస్సు బయల్దేరగా.. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలోకి చేరుకోగానే ముందు ఐరన్ రాడ్లతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. బస్సు రైట్ యాక్సిడెంట్ కాకా.. ఐరన్ రాడ్లు బస్సులోపలికి దూసుకెళ్లాయి. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లతో కలిపి మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. సహాయక చర్యలు చేట్టి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా.. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు, మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఖైదీతో మహిళా అధికారి న్యూడ్ కాల్....

బెంగళూరు, ఆగస్టు 26, కర్ణాటకలో ఓ మహిళా పోలీస్ అధికారికి సంబంధించిన వీడియో కాల్ వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. బెళగావిలోని హిండాల్గా సెంట్రల్ జైలులో ఉన్న వ్యక్తితో ఆమె వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వీడియోలో అధికారి అభ్యంతరకర రీతిలో కనిపించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖలోనూ చర్చనీయాంశంగా మారింది.తాజా సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారానికి సంబంధించి ఆ మహిళా అధికారి బెంగళూరులోని కబ్బన్ పార్క్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తనకు సంబంధించిన వీడియోను కొందరు వ్యక్తులు రికార్డు చేసి, ఇతరులకు పంపించారని ఆమె ఆరోపించినట్లు రిపోర్టులు చెబుతున్నాయి. ఈ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.వైరల్ అయిన క్లిప్‌లో మహిళా పోలీస్ అధికారి యూనిఫాంలో కనిపించినట్లు, అనంతరం అభ్యంతరకర స్థితిలో ఉన్న దృశ్యాలు ఉన్నట్లు పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వీడియో ఎప్పుడు, ఎలా రికార్డు అయింది? దాన్ని ఎవరు బయటకు పంపించారు? ఖైదీ వద్దకు మొబైల్ ఫోన్ ఎలా చేరింది? వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అందువల్ల సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి వాదనను వాస్తవంగా పరిగణించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.లో కర్ణాటక జైళ్లలో ఖైదీలకు మొబైల్ ఫోన్లు, ఇతర నిషేధిత వస్తువులు ఎలా అందుతున్నాయనే అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఇటీవలే బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో తనిఖీలు నిర్వహించగా మొబైల్ ఫోన్ సహా నిషేధిత వస్తువులు బయటపడిన విషయం తెలిసిందే. జైళ్లలో అక్రమ కార్యకలాపాలను సహించబోమని హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే హెచ్చరించారు.ఖైదీ హైప్రొఫైల్ వ్యక్తి అయినా, సాధారణ ఖైదీ అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఖర్గే స్పష్టం చేశారు. జైళ్లలో నిషేధిత పరికరాలకు అవకాశం కల్పించే అధికారులు, సిబ్బందిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అవసరమైతే నేరం రుజువైన అధికారులను ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం ఉందని చెప్పారు.ఇదిలా ఉండగా, మహిళా పోలీస్ అధికారికి సంబంధించిన ఈ వీడియో ఘటనపై పూర్తి వివరాలు దర్యాప్తు తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. వీడియో నిజమైనదేనా, దాని పూర్తి నేపథ్యం ఏమిటి, దాన్ని ఎవరు రికార్డు చేసి వైరల్ చేశారు, జైలులోని నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించారా అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన పోలీసు శాఖ ప్రతిష్ఠ, జైలు భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది.

# రేవంత్ పట్టు కోల్పోతున్నారా

హైదరాబాద్ ఆగస్టు 26, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చుట్టూ జరుగుతున్న అంతర్గత రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ శ్రేణుల్లోనే తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కాంగ్రెస్‌లో ఓ రకమైన పరిస్థితి ఉన్నప్పుడు విదేశీ పర్యటన ముగించుకుని సీఎం శంషాబాద్ విమానాశ్రయంలో దిగినప్పుడు కేవలం ఒకే ఒక్క జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే తప్ప మరే ఇతర ముఖ్య నేతలూ స్వాగతం పలికేందుకు రాలేదు. ఉదయం పది గంటలకు పిలిచిన ఎమ్మెల్యేల అత్యవసర సమావేశానికి మెజారిటీ ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడం అధికార పార్టీలో నెలకొన్న సమన్వయ లోపాన్ని బహిర్గతం చేస్తోంది. సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌కు మంత్రులు తీరిగ్గా, ఆలస్యంగా హాజరుకావడం క్షేత్రస్థాయిలో పార్టీ అధినేత పట్ల ఉండాల్సిన కమాండింగ్ తీరును ప్రశ్నించేలా చేస్తోంది.ప్రస్తుత రాజకీయ సమీకరణాలు, పార్టీలో ఉన్న సంఖ్యాబలం ప్రకారం కనీసం 50 నుంచి 60 మంది ఎమ్మెల్యేలు, మంత్రుల బలప్రదర్శన సహజంగా కనిపించాలి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో అధినేత మాటకు తిరుగులేని ఆధిపత్యం ఉండేది. అసంతృప్తి ఎంత ఉన్నా వైఎస్సార్ కనుసన్నల్లో ఉండేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు పరుగులు తీసేవారు. కానీ నేడు రేవంత్ రెడ్డి విషయంలో అంతటి రాజకీయ భయం, క్రమశిక్షణ కనిపించడం లేదు. ప్రెస్‌మీట్లలోనూ కేవలం కొద్దిమంది మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే కనిపించడం వల్ల.. వారే రేవంత్ వర్గీయులని, మిగిలిన వారంతా వ్యతిరేకులనే ప్రచారం ప్రజల్లోకి వెళ్లేందుకు ఆస్కారం కల్పిస్తోంది.ఒక ప్రాంతీయ లేదా రాష్ట్ర స్థాయి అగ్రనేతకు ఉండాల్సిన ప్రధాన బలం రాజకీయ పట్టు. ముఖ్యమంత్రి కార్యాలయం, రేవంత్ రెడ్డి తరపు నుంచి ఏదైనా ఆదేశం వచ్చిందంటే.. నాయకులు తమ వ్యక్తిగత అసంతృప్తిని పక్కన పెట్టి శిరసావహించే స్థాయి అధికారం, విశ్వసనీయత ఉండాలి. అయితే, గ్రూపు రాజకీయాలకు చిరునామా అయిన కాంగ్రెస్ సంస్కృతిలో పలువురు సీనియర్ మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు స్వతంత్రంగా వ్యవహరిస్తుండటంతో అధికార కేంద్రం ఎక్కడ ఉందనే అయోమయం నెలకొంది. సమన్వయ లోపాలు విపక్షాల విమర్శలకు, పార్టీలో అసమ్మతి రగులుతోందన్న కథనాలకు బలం చేకూరుస్తున్నాయి.ఈ వైఫల్యాలన్నింటినీ గమనిస్తే రేవంత్ రెడ్డికి పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలను నడిపించే ఒక సమర్థవంతమైన పొలిటికల్ మేనేజర్ లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో వైఎస్సార్‌కు కేవీపీ రామచంద్రరావు లాంటి వ్యూహకర్తలు తెరవెనుక ఉండి అసంతృప్తులను బుజ్జగించడం, మంత్రులు-ఎమ్మెల్యేలను సమన్వయం చేయడం, హైకమాండ్‌కు సీఎం బలాన్ని ప్రదర్శించడం వంటి పనులను పకడ్బందీగా నిర్వహించేవారు. రేవంత్ రెడ్డి స్వయంగా దూకుడుగా ఉన్నప్పటికీ, ఆయన తరపున పార్టీలోని విభిన్న వర్గాలను ఏకతాటిపైకి తెచ్చే బలమైన అంతర్గత సమన్వయకర్త లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ, ప్రతి ఒక్కరిని కలుపుకుపోయే అంతర్గత వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం రేవంత్ రెడ్డికి చాలా ఉంది.

# కోదాడ వద్ద ప్రమాద ఘటనపై

## పవన్ కళ్యాణ్ విచారం

హైదరాబాద్?విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వివరించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, తెలంగాణ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కళ్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు

హైదరాబాద్, ఆగస్టు 26, ఏడేళ్ల విరామం అనేది చిన్న విషయం కాదు, ముఖ్యంగా విస్తృతంగా వాణిజ్యం చేసుకుంటూ, సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా తరచుగా విభేదించే రెండు పొరుగు దేశాలైన భారత్, చైనాల విషయంలో ఇది మరింత ముఖ్యమైనది. ఇప్పుడు, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత పర్యటనపై వార్తలు వస్తున్నాయి. ఆయన సెప్టెంబర్ 12, 13 తేదీలలో న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు హాజరు కానున్నారు. ఆయనతో పాటు సుమారు 400 మంది అధికారులతో కూడిన ఒక పెద్ద ప్రతినిధి బృందం రావచ్చని సమాచారం. హోటళ్లను సమీక్షిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పర్యటన ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అయినప్పటికీ, షీ భారతదేశానికి వస్తున్నారని బీజింగ్ ఇంకా ప్రకటించలేదు. సన్నాహాలు ఇంత విస్తృతంగా ఉంటే, ప్రకటనలో ఎందుకీ ఆలస్యం? చివరి నిమిషం వరకు చైనా తన వ్యూహాలను గోప్యంగా ఉంచడానికి ప్రయత్నిస్తోందా? లేక మోదీ, షీల మధ్య ప్రత్యేక సమావేశానికి సంబంధించిన అజెండా ఇంకా ఖరారు కాలేదా? మీడియా నివేదికల నుంచి వస్తున్న కొన్ని వార్తల తర్వాత ఈ ప్రశ్నలు మరింత పెద్దవిగా మారాయి.

జిన్‌పింగ్ చివరిసారిగా 2019 అక్టోబర్‌లో భారతదేశాన్ని సందర్శించారు. ఆయన మహాబలిపురంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు . సముద్ర తీరంలో ఇద్దరు నాయకులు ఉన్న ఫోటోలు వార్తల్లో ప్రముఖంగా నిలిచాయి. అప్పటి వాతావరణం భిన్నంగా ఉండేది. కొన్ని నెలల తర్వాత, గాల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణలో భారత, చైనా సైనికులు మరణించారు. సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరు దేశాలు భారీ సంఖ్యలో సైనిక బలగాలను మోహరించాయి. చైనా యాప్‌లపై భారత్ కఠిన చర్యలు చేపట్టింది. పెట్టుబడులు, వాణిజ్యం కూడా కష్టంగా మారాయి. అక్టోబర్ 2024లో గస్తీలు , దళాల ఉపసంహరణపై కొంత ఒప్పందం కుదిరింది. చర్చలు పునఃప్రారంభమయ్యాయి, కానీ సంబంధాలలో ఏర్పడిన చీలిక మాత్రం నయం కాలేదు. ఇప్పుడు, ఒకవేళ షీ భారతదేశానికి వస్తే, ఆయన విమానం కేవలం ఒక విదేశీ అతిథిని మాత్రమే తీసుకురాదు. అది తనతో పాటు ఏడేళ్ల ఉద్రిక్తతను, గాల్వాన్ లోయ జ్ఞాపకాలను, భవిష్యత్తుపై ఎన్నో ఆశలను కూడా తీసుకువస్తుంది.ప్రపంచ వాణిజ్యం చుట్టూ ఒక కొత్త ఘర్షణ మొదలవుతోంది. అమెరికా ఒత్తిడి పెరిగింది. చైనా కొత్త మార్కెట్లను, బలమైన భాగస్వాములను కోరుకుంటోంది. భారతదేశం ఒక ప్రధాన ప్రపంచ మార్కెట్ , గ్లోబల్ సౌత్‌కు బలమైన గొంతుకగా కూడా మారింది. భారతదేశంతో ఘర్షణలు కొనసాగించడం చైనాకు కూడా ప్రయోజనకరం కాదు, ముఖ్యంగా అది బహుముఖంగా ఆర్థిక, వ్యూహాత్మక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో. అందుకే షీ సంభావ్య పర్యటన ఆకస్మిక స్నేహ సంకేతం కాదు. అది చైనాకు ఒక అవసరం కావచ్చు. అయితే, తన సంబంధాలను చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉన్న ఏకైక దేశం చైనా మాత్రమే కాదు. సరిహద్దులో నిరంతర ఉద్రిక్తతను భారత్ కూడా కోరుకోవడం లేదు. దీర్ఘకాలిక సైనిక మోహరింపులు ఖర్చుతో కూడుకున్నవి. వాణిజ్య అనిశ్చితి భారతీయ కంపెనీలపై కూడా ప్రభావం చూపుతుంది ఇద్దరూ సంభాషణ కోరుకుంటున్నారు. తేడా ఒక్కటే, ఇద్దరూ తమ తమ పద్ధతుల్లో మాట్లాడాలని కోరుకుంటున్నారు.చైనా జాతీయ జాతకం అక్టోబర్ 1, 1949 నాటిది. దాని లగ్నం మకర రాశి. సెప్టెంబర్ 2026లో, గురు గ్రహం దాని జాతకంలో ఏడవ ఇంట్లో ఉంటుంది.దేశ జాతకంలో ఏడవ ఇల్లు ఇతర దేశాలతో సంబంధాలను మరియు ముఖాముఖి సంభాషణలను సూచిస్తుంది. ఇక్కడ గురు గ్రహం బలమైన స్థానం, ప్రధాన అంతర్జాతీయ వేదికలపై చైనా భాగస్వామ్యాన్ని పెంచగలదు. మరో ముఖ్యమైన సూచన ఏంటంటే, చైనా జాతకంలో ఆగస్టు 25 నుంచి అక్టోబర్ 2 వరకు గురు ముద్రా దశ అమలులో ఉంటుంది. ఈ కాలం విదేశీ సంబంధాలు, పెద్ద సమూహాలు , దౌత్యపరమైన విజయాలతో ముడిపడి ఉంటుంది. ఇదే కాలంలో బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. ఈ యాదృచ్ఛికతను విస్మరించలేము.సెప్టెంబర్‌లో చైనా రాశిఫలాలు ప్రధాన విదేశీ పర్యటనలు, ఉన్నత స్థాయి చర్చలకు అవకాశం ఉందని సూచిస్తున్నాయి. ఇది షీ భారతదేశ పర్యటనకు ఉన్న అవకాశాలను బలపరుస్తుంది. అయితే, ఇక్కడ చేసిన విశ్లేషణ చైనా జాతీయ రాశిఫలాలను ప్రతిబింబిస్తుంది కానీ షీ వ్యక్తిగత రాశిఫలాలను కాదు కాబట్టి, దీనిపై ఒక నిశ్చయాత్మక నిర్ధారణకు రాలేము.భారతదేశ జాతకం వృషభ లగ్నం. సెప్టెంబరులో, గురు గ్రహం పొరుగువారు, సమాచార మార్పిడి చర్చలకు సంబంధించిన తృతీయ భావంలో ఉంటుంది. దీని అర్థం, న్యూఢిల్లీ చర్చల నుంచి వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. కానీ కథ ఇక్కడితో ముగియదు. భారతదేశ జాతకంలో, ఆ సమయంలో ఏడవ ఇంటికి సంబంధించిన రాహువు ముద్రా దశ ప్రభావంలో ఉంటుంది. రాహువు విదేశీ కార్యకలాపాలను పెంచుతుంది, కానీ అన్ని విషయాలపై స్పష్టతను ఇవ్వదు. ప్రజలు ఒకటి చెబుతుండగా, తెర వెనుక మరొకటి జరుగుతూ ఉండవచ్చు.ఈ కారణంగానే పర్యటన ప్రకటన ఆలస్యం కావచ్చు. మోదీ-షి జిన్‌పింగ్ సమావేశపు అజెండా కూడా చివరి నిమిషంలో మారవచ్చు. ఒక కీలక ప్రకటనపై చర్చ జరిగే అవకాశం కూడా ఉంది, కానీ దాని ఫలితం పరిమితంగానే ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, భారత్ తలుపులు తెరుస్తుంది, కానీ అప్రమత్తతను మాత్రం తగ్గించుకోదు.షీ రాకతో సరిహద్దు వివాదం పరిష్కారమవుతుందనడానికి ఎలాంటి సూచన లేదు. గ్రహాలు చర్చలకు సహకరిస్తున్నాయి, కానీ అవి తక్షణమే విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నట్లు కనిపించడం లేదు. అవును, సరిహద్దులో సైనికుల ఘర్షణల ఘటనలను నివారించడానికి కొత్త పద్ధతులను కనుగొనవచ్చు. సైనిక అధికారుల మధ్య సమావేశాలు పెరగవచ్చు. గస్తీ నియమాలను మళ్లీ చర్చించవచ్చు. దీని అర్థం ఏంటంటే, సెప్టెంబర్‌లో ఒక పరిష్కారం దొరకకపోవచ్చు, కానీ పరిష్కారానికి ఒక కొత్త మార్గం దొరకవచ్చు. ఈ వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఇద్దరు నాయకులు కరచాలనం చేసినంత మాత్రాన వాస్తవ నియంత్రణ రేఖ వద్ద అంతా పరిష్కారమైనట్లు కాదు.భారతదేశంలో ఉపయోగించే మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు మరియు సౌర పరికరాలలోని అనేక భాగాలు చైనా నుంచి వస్తాయి. మెరుగైన సంబంధాలు వస్తువుల సరఫరాను సులభతరం చేయడంతో పాటు భారతీయ పరిశ్రమలకు అనిశ్చితిని తగ్గించగలవు. అయితే, మొబైల్ ఫోన్లు లేదా కార్లు వెంటనే చౌకగా మారతాయని చెప్పడం తప్పు. పన్నులు, డాలర్ విలువ, కార్పొరేట్ నిర్ణయాలు కూడా ధరలను నిర్ణయిస్తాయి. తక్షణ ప్రభావాలు ఇతర ప్రాంతాలలో కనిపించవచ్చు. ప్రత్యక్ష విమాన సర్వీసులు పెరగవచ్చు. వీసా నిబంధనలు సడలించబడవచ్చు. విద్యార్థులు, వ్యాపారవేత్తలు , యాత్రికుల రాకపోకలు సులభతరం కావచ్చు. ఇవి చిన్న అడుగులుగా అనిపించవచ్చు, కానీ రెండు దేశాల మధ్య దెబ్బతిన్న నమ్మకం తరచుగా ఇలాగే తిరిగి ఏర్పడుతుంది.భారత్, చైనా జాతకాలు సెప్టెంబర్‌లో చర్చలు జరుగుతాయని బలంగా సూచిస్తున్నాయి. షీ జిన్‌పింగ్ కూడా పర్యటించే అవకాశం ఉంది, బహుశా మోదీతో విడిగా సమావేశం కావచ్చు. కొన్ని చిన్న నిర్ణయాలు కూడా వెలువడవచ్చు. అయితే, ఈ జాతకం ఒక హెచ్చరికను కూడా అందిస్తోంది. చైనా చెప్పే మాటలను, క్షేత్రస్థాయిలో చేసే పనులను వేరువేరుగా విశ్లేషించాలి. అందువల్ల, సెప్టెంబర్ 12న షీ భారతదేశానికి రావడం ఈ కథకు ముగింపు కాదు. అది కేవలం ఆరంభం మాత్రమే అవుతుంది. సమావేశం తర్వాతే అసలైన సమాధానం వస్తుంది.

# కొండా పై వేటు సాధ్యమేనా

హైదరాబాద్, వరంగల్, ఆగస్టు 26, తెలంగాణ కాంగ్రెస్ రాజకీయంలో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబం వర్సెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గం మధ్య సాగుతున్న అంతర్గత సమరం ఒక్కసారిగా తారాస్థాయికి చేరింది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆయన కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేయడం, రాబోయే ఎన్నికల్లో పరకాల సీటుపై సీఎం చేసిన వ్యాఖ్యలను సవాలు చేస్తూ విమర్శలు గుప్పించడంతో మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ పరిణామంతో కాంగ్రెస్ అధిష్టానం ఇక ఎంతమాత్రం సహించే ప్రసక్తే లేదనే స్పష్టమైన సంకేతాలను పంపింది. ఆమె తనకేం సంబంధం లేదని సమాచారం పంపినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. కొండా కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరొందిన మాజీ ఓఎస్డీ ఎన్. సుమంత్ చుట్టూ చట్టపరమైన ఉచ్చు వేగంగా బిగుస్తుండటం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. గతంలో డెక్కన్ సిమెంట్స్ ప్రతినిధులను బెదిరించిన వ్యవహారంలో ఓఎస్డీ పదవి నుంచి తొలగించబడిన సుమంత్‌పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఃబొా సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు కావడం ఇప్పుడు సంచలనంగా మారింది. సుస్మితా పటేల్ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే పాత ఘటనపై పోలీసులు ఇంత వేగంగా స్పందించి కేసు నమోదు చేయడం వెనుక, కొండా నెట్‌వర్క్‌ను చట్టపరంగా ఇరకాటంలో పడేసే పక్కా వ్యూహం ఉందనే ప్రచారం బలపడుతోంది. మరోవైపు ఉమ్మడి వరంగల్ , ఇతర జిల్లాలకు చెందిన సుమారు 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని బహిరంగంగా డిమాండ్ చేయడం కాంగ్రెస్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోంది. డిసిప్లినరీ కమిటీ ద్వారా నోటీసు ఇచ్చి వివరణ కోరడం, అదే సమయంలో పోలీసు యంత్రాంగం ద్వారా అవినీతి, అక్రమ సెటిల్‌మెంట్ల ఆరోపణలపై లీగల్ విచారణ వేగవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ అగ్రనాయకత్వం డబుల్ స్ట్రోక్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఈ వరుస పరిణామాలు కేవలం వ్యక్తగత విభేదాలకే పరిమితం కాకుండా కాంగ్రెస్ పార్టీ అంతర్గత ఆధిపత్య పోరును ప్రతిబింబిస్తున్నాయి. గతంలో సినీ ప్రముఖుల విడాకులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఇతర మంత్రి సహచరులతో ఏర్పడిన వైరుధ్యాలు, ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రిపైనే కూతురితో ఘాటు వ్యాఖ్యలు చేయించడం వంటి వరుస తప్పులు కొండా సురేఖ పొలిటికల్ గ్రాఫ్‌ను దెబ్బతీశాయి. దీంతో ఆమె బిసి వర్గానికి చెందిన నాయకురాలనే వెసులుబాటును కూడా అధిష్టానం ఈసారి పరిగణనలోకి తీసుకునే పరిస్థితి లేదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వరంగల్ రాజకీయాల్లో కొండా దంపతులకు స్వయంకృత ప్రతిపత్తి ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి అధిష్టానం పూర్తి అండదండలు ఉండటంతో ఈసారి కొండా కుటుంబానికి తప్పించుకునే మార్గాలు మూసుకుపోతున్నాయి. పొలిటికల్‌గా షోకాజ్ నోటీసులు, లీగల్‌గా ఓఎస్డీ సుమంత్‌పై కేసులు, పార్టీపరంగా ఎమ్మెల్యేల వ్యతిరేకత? ఈ మూడు వైపుల నుంచి వస్తున్న ఒత్తిడితో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసే దాకా లేదా రాజీనామా చేయించే దాకా ఈ 'ఆట' ఆగదనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి

బీసీ కార్డు కాపాడుతుందా

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబ వ్యవహార శైలిపై మొదలైన వివాదం ఇప్పుడు అత్యంత సున్నితమైన సామాజిక, బీసీ సమీకరణాల మలుపు తీసుకుంది. తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ కేటాయింపులపై చేసిన ఆరోపణల తర్వాత, తీవ్రమైన రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న సురేఖ.. తనకు ఉన్న ఏకైక , బలమైన బీసీ కార్డ్ ను బయటకు తీశారు. క్యాబినెట్‌లోని సీనియర్ బీసీ మహిళా మంత్రిగా ఉన్న తనపై 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి దాడి చేయించడాన్ని బీసీల వేధింపుగా చిత్రీకరించే ప్రయత్నం సురేఖ చేస్తున్నారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సురేఖ అంటున్నారు. అంతటితో ఆగకుండా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ జెండా మోసిన తమ కుటుంబాన్ని, ఓట్ల శాతం ఎక్కువగా ఉన్న బీసీ వర్గాన్ని తగ్గించేందుకే ఈ కుట్ర జరుగుతోందనే సంకేతాలను కేడర్‌లోకి పంపేలా ఈ వ్యూహం ఉంది.పిల్లలు చేసిన వ్యాఖ్యలకు తల్లిగా నన్ను టార్గెట్ చేయడం బీసీ నాయకత్వాన్ని అణచివేసే కుట్రలో భాగమే అన్న సంకేతాలు ఇవ్వడమే కొండా దంపతుల వ్యూహంగా కనిపిస్తోంది. ఈ బీసీ సెంటిమెంట్ అస్త్రం కొండా సురేఖను పదవి నుంచి కాపాడగలదా అంటే.. ప్రస్తుతానికి అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఈసారి కొండా సురేఖను కాపాడే పరిస్థితి లేదు, సీఎంపై వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయి అని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. స్వయంగా పీసీసీ అధ్యక్షుడే ఈ రకమైన తీవ్రమైన వ్యాఖ్య చేయడం ద్వారా, అధిష్టానం ఇప్పటికే కొండా సురేఖ విషయంలో ఒక కఠినమైన నిర్ణయానికి వచ్చిందని స్పష్టమవుతోంది.మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వివాదాన్ని కేవలం వ్యక్తిగత విమర్శగా చూడకుండా పార్టీ క్రమశిక్షణ సమస్యగా మార్చడంలో విజయవంతమయ్యారు. ప్రెస్మీట్‌లో ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు . పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్నారు. రేవంత్ సోదరుడి భూములపై సుస్మిత నేరుగా దాడి చేయడం వల్ల, సురేఖకు కేబినెట్‌లో కొనసాగే అర్హత లేదని రేవంత్ అనుకూల ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రెస్మీట్ పెట్టారు. పైగా, కాంగ్రెస్ హైకమాండ్ , ఏఐసీసీ కూడా ప్రభుత్వం సుస్థిరంగా సాగాలంటే సీఎం ప్రాధాన్యతకే మొగ్గు చూపుతాయని చెప్పాల్సిన పని లేదు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణాలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీల ప్రాతినిధ్యం, సమాన అవకాశాలను కాపాడటానికి మహేశ్ కుమార్ గౌడ్ ఇప్పటికే పీసీసీ చీఫ్‌గా ఉన్నారు. అందువల్ల సురేఖను కేబినెట్ నుంచి తప్పించినా, అది కాంగ్రెస్ మొత్తం బీసీలకు వ్యతిరేకం అనే ముద్ర పడకుండా అధిష్టానం కవర్ చేసుకోగలదు. కొండా సురేఖ బీసీ కార్డును ఎంత గట్టిగా పట్టుకున్నప్పటికీ, పార్టీ డిసిప్లినరీ కమిటీ తుది నివేదిక వచ్చాక ఏఐసిసి ఇచ్చే ఆదేశాలే ఆమె రాజకీయాన్ని తేలుస్తాయి. కొండా సురేఖకు మిగిలిన ఏకైక మార్గం.. తన కుమార్తె వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తూ, పీసీసీ, సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పడం లేదా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండటం. లేనిపక్షంలో, బీసీ సెంటిమెంట్ ఎంత పండించినప్పటికీ.. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నాయకత్వం ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించి, పార్టీపరంగా సైడ్ చేయడమే తదుపరి పరిణామంగా మారబోతోం

# అధ్యక్షా పదవులు ఎప్పుడు...

హైదరాబాద్ ఆగస్టు 26, తెలంగాణలో అధికారంలోకి వచ్చి మూడేళ్ల సమయం గడుస్తున్నా, పార్టీ కోసం పని చేసిన క్షేత్రస్థాయి కార్యకర్తలను కాంగ్రెస్ నాయకత్వం కనీసం పట్టించుకోకపోవడంపై పార్టీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు కేవలం తమ పదవులు, అధికారిక ప్రాధాన్యతలకే పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జుల వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్యకర్తల గుర్తింపు విషయంలో వారి నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడం పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరుకు అద్దం పడుతోంది.సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు, వివిధ కార్పొరేషన్లు , స్థానిక నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం వెంటనే ప్రతిపాదనల జాబితాను అందజేయాలని మహేష్ గౌడ్ పలుమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలను కోరినప్పటికీ, వారి నుంచి ఆశించిన స్పందన రాకపోవడం శోచనీయం. నియోజకవర్గ స్థాయిలో కష్టపడిన నాయకుల వివరాలను పంపాల్సిందిగా పదే పదే సూచిస్తున్నా, నేతలు జాబితాలను పంపడంలో జాప్యం చేస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో 70 శాతం పదవులను ఏళ్లనుంచి పార్టీని నమ్ముకుని ఉన్న పాతవారికి, 30 శాతం పదవులను కొత్తగా వచ్చిన వారికి సిఫార్సు చేయాలని స్వయంగా పార్టీ అధినేతే బతిమాలుతున్నట్లుగా కోరుతున్నా నేతలు పట్టించుకోకపోవడం పట్ల కేడర్ తీవ్ర ఆగ్రహంతో ఉంది.అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు పదవులు, ప్రాధాన్యతలు దక్కితే చాలన్నట్లుగా కొందరు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు శ్రమించి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన సాధారణ కార్యకర్తలు, ఇప్పుడు తమ సమస్యలు చెప్పుకుందామన్నా మంత్రులు, ఎమ్మెల్యేల దర్శనం దొరకని పరిస్థితి నెలకొంది. కనీసం తమకు రావలసిన నామినేటెడ్ పోస్టుల విషయంలోనైనా న్యాయం జరుగుతుందా అంటే, నేతల అలసత్వం వల్ల ఆ ప్రక్రియ కూడా మూలనపడిపోతోందని కింది స్థాయి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కేడర్‌ను గౌరవించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ స్వార్థ రాజకీయాలను, వర్గపోరును పక్కనపెట్టి తక్షణమే నామినేటెడ్ పోస్టుల జాబితాలను టీపీసీసీకి పంపించకపోతే, కింది స్థాయిలో మొదలైన ఈ అసంతృప్తి జ్వాలలు పార్టీకి పెద్ద గండంగా మారే ప్రమాదం ఉంది

# తాగినోళ్లకు తాగినంత

అదిలాబాద్ ఆగస్టు 26, మిగతా వాటి విషయంలో ఎలా ఉంటారో తెలియదు కానీ.. తాగే బ్రాండ్ల విషయంలో మందుబాబులు ఒక క్లారిటీతో ఉంటారు. ఎందుకంటే వాళ్లకు నచ్చిన బ్రాండ్ తాగితేనే కిక్. లేకపోతే వారి కోపం తారస్థాయికి చేరుతుంది. తిక్క రేగితే ప్రభుత్వాన్ని కూడా మార్చగలరు. ఎందుకంటే వాళ్లకు తాగే విషయంలో.. తాగే మందు కిక్కు ఎక్కించే విషయంలో ఏ మాత్రం కాంప్రమైజ్ కారు.అప్పట్లో జగన్ ప్రభుత్వం ఏపీలో అధికారంలో ఉన్నప్పుడు తిక్క తిక్క బ్రాండ్లు మొత్తం మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఆ చెత్త బ్రాండ్ల మందు తాగలేక.. ఇతర బ్రాండ్లను రాష్ట్రంలోకి తీసుకొచ్చే అవకాశం లేక మందు బాబులు పడ్డ ఇబ్బందులు మామూలువి కావు. ఆంధ్ర సరిహద్దులో ఉండే తెలంగాణ ప్రాంతాల నుంచి మందుబాబులు మందు కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. అయితే ఈ వ్యవహారానికి అడ్డు కట్టడానికి ఏపీ పోలీసులు ప్రత్యేకంగా చెక్పోస్టులు ఏర్పాటు చేసే వారంటే.. నాడు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరికి వారు కోరుకున్న బ్రాండ్ల మద్యం అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో నాటి టిడిపి అధ్యక్షుడు చంద్ర బాబు చెప్పారు అంటే.. మందుబాబులు బ్రాండ్లకు ఇచ్చే విలువ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.మద్యం వినియోగంలో దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో కూడా మద్యం వినియోగం అధికంగా ఉంది. ఒకప్పుడు అకేషనల్ గా మాత్రమే చాలామంది తాగేవారు. ఇప్పుడు ఒక అలవాటుగా తాగడాన్ని మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లోకి కొత్త కొత్త బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలో తెలంగాణ మార్కెట్లోకి చీతా.. టైగర్.. రెడ్ హార్స్ వంటి బ్రాండ్లు అందుబాటులోకి రాబోతున్నాయి. మార్కెట్లో ఏకంగా 121 కొత్త మద్యం బ్రాండ్లను తీసుకురావడానికి ఎక్సైజ్ శాఖకు దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా 18 కంపెనీలు ఈ దరఖాస్తులు సమర్పించాయి. ఈ బ్రాండ్ల సరఫరాకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. ఇక కొత్త బ్రాండ్ల జాబితాలో ఆ బెస్ట్.. బర్గర్.. టైగర్.. రెడ్ హార్స్.. బుటానిస్.. సీయోక్ బింగో.. కాకావిస్.. డాన్ గ్లాంగ్ వంటి బీర్లతోపాటు.. విస్కీ.. బ్రాందీ వంటి వాటిలో కూడా మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రాబోతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో మద్యం సిండికేట్ వల్ల చాలా ప్రాంతాలలో కొన్ని కంపెనీలకు సంబంధించిన బీర్లు.. విస్కీ.. బ్రాందీ అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఈ సిండికేట్ ఆగడాలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొత్త బ్రాండ్లు అందుబాటులోకి వస్తే మందుబాబులు ఏ విధంగా స్వీకరిస్తారనేది చూడాల్సి ఉంది. సాధారణంగా తెలంగాణ రాష్ట్రంలో మందుబాబులు బ్రాండ్లకు విపరీతమైన ప్రియారిటి ఇస్తారు. ఆమధ్య తమ కోరుకున్న బ్రాండ్ బీర్లు అందుబాటులో లేవని తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో మద్యం షాపులు ఎదుట మందుబాబులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ కొత్త బ్రాండ్లను తీసుకువచ్చి మందుబాబుల ఆగ్రహానికి ప్రభుత్వం గనుక గురైతే అప్పుడు పరిస్థితి వేరే విధంగా ఉంటుంది అందువల్లే బ్రాండ్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

# హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హత్యకు కుట్ర

హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డ సత్యనారాయణ హత్యకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కడి శివ చరణ్ రెడ్డి కుట్ర పన్నినట్లు బాధితుడు ఆరోపించాడు. బుధవారం ఉదయం ఉదయం నల్గురు యువకుల తో రెక్కీ నిర్వహించారు. మన్సూరాబాద్ లో సత్యనారాయణ నిర్వహిస్తున్న రేషన్ షాప్ ముందు గంటసేపు అనుమానాస్పదంగా ఆ నలుగురు తిరుగుతున్నారు. అనుమానంతో వారిని పట్టుకోవడంతో విషయం బట్టబయలయిందని అన్నాడు. నలుగురిలో ముగ్గురు పారిపోగా స్థానికులు ఒకరిని పట్టుకున్నారు. పోలీసులకు అప్పగించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి పంపించాడని పోలీసుల ముందు పట్టుబడిన యువకుడు చెప్పాడు. పట్టుబడిన యువకుడి పేరు గార్లపాటి అరవింద్ రెడ్డి గా వెల్లడి అయింది. కొన్ని రోజులుగా బుడ్డ సత్యనారాయణ తో శివచరణ్ రెడ్డి అతని తండ్రి ప్రభాకర్ రెడ్డి లకు వివాదం నడుస్తోంది. ప్రభాకర్ రెడ్డి పై ఎకస్సీ, ఎస్టీ బబి కేసు బుడ్డ సత్యనారాయణ పెట్టాడు. దాంతో సత్యనారాయణ పై శివ చరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలు కోపంగా వున్నారు. జక్కిడి శివచరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి లపై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో సత్యనారాయణ ఫిర్యాదు చేసాడు. శివ చరణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి గారు అరెస్టు చేయాలని.. శివ చరణ్ రెడ్డి ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా సంఘాలే మాదకద్రవ్య రహిత సమాజానికి 'సంఘమిత్రలు'

### మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి మహిళ భాగస్వామి కావాలి
### 112కు సమాచారం ఇవ్వండి.. యువత భవిష్యత్తును కాపాడండి: వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత
### జనగామను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



వరంగల్ మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి మహిళ తన కుటుంబంతో పాటు గ్రామాలు, పట్టణాలను కూడా మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడే 'సంఘమిత్ర'గా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు.

బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు 'సంఘమిత్ర ? మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు' నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, డీసీపీ రాజమహేంద్ర నాయక్లతో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గర్భిణీలకు పోషకాహారం అందించడం నుంచి చిన్నారులకు మధ్యాహ్న భోజనం, అక్షరాస్యత, కుటుంబ సంక్షేమం, సామాజిక ఆడిట్ వంటి అనేక కార్యక్రమాల్లో మహిళలు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు.

జనగామ జిల్లాలో మహిళల చైతన్యం ప్రత్యేకమైనదని పేర్కొంటూ, ఆ చైతన్యాన్ని సమాజ భద్రత కోసం వినియోగించాలని కోరారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 26 లక్షల జనాభాకు కేవలం 3 వేల మంది పోలీసు సిబ్బంది మాత్రమే ఉన్నారని, అందువల్ల మహిళా సంఘాల సహకారం అత్యంత అవసరమని వివరించారు.

పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో డ్రగ్స్ వ్యసనం అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణలో అలాంటి పరిస్థితి రాకుండా ఇప్పుడే సమిష్టిగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారిని కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి మహిళా సంఘం బాధ్యత అని స్పష్టం చేశారు.

గంజాయి వంటి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు వెంటనే కనిపించకపోయినా, కొంతకాలానికి మెదడు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. డ్రగ్స్కు బానిసైన వారిని నేరస్తులుగా చూడటం సరికాదని, వారికి చికిత్స అందించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు.

మహిళా సంఘాలు సామాజిక మార్పుకు బలమైన వేదికలుగా ఉన్నాయని, పోలీస్ శాఖలో పరిమిత సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ మహిళా సంఘాల ద్వారా లక్షలాది మందికి అవగాహన కల్పించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి మహిళా సంఘ సమావేశంలో డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళల భద్రత వంటి అంశాలపై తప్పనిసరిగా చర్చించాలని సూచించారు.

గ్రామాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలకు బానిసైనట్లు తెలిసినా, గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే 112కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, అవసరమైతే బహుమతులు కూడా అందజేస్తామని వెల్లడించారు.

పాఠశాల నిర్వహణ కమిటీల్లో ఉన్న మహిళా సభ్యులు విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతి లేదా ఇతర తరగతుల విద్యార్థులు అకస్మాత్తుగా పాఠశాలకు రాకపోవడం, తల్లిదండ్రుల మాట వినకపోవడం, అనుమానాస్పదంగా ప్రవర్తించడం వంటి అంశాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

'సంఘమిత్ర' కార్యక్రమం ఒకరోజు కార్యక్రమంతో ముగిసేది కాదని, ఇకపై మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్యల సమావేశాల్లో పోలీసు అధికారులు క్రమం తప్పకుండా పాల్గొని డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు మహిళా సంఘాలే ప్రధాన శక్తిగా నిలవాలన్నారు. జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని, వీరి ద్వారా ప్రతి ఇంటికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని తీసుకెళ్లవచ్చని చెప్పారు.

డ్రగ్స్ వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాల్లో గృహహింస, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ మహిళా సంఘాలు, సంఘ సమాఖ్యలు, కాలనీ సమావేశాల్లో చర్చించి, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు.

జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ, జనగామ జిల్లా మహిళా సంఘాలు రాష్ట్రంలోనే అత్యంత చైతన్యవంతమైన సంఘాలుగా గుర్తింపు పొందాయన్నారు.

డ్రగ్స్ మొదట సరదాగా ప్రారంభమై చివరకు ప్రాణాంతక వ్యసనంగా మారుతాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో మార్పులు, ఆలస్యంగా ఇంటికి రావడం, రాత్రిళ్లు మేల్కొని ఉండడం, కొత్త స్నేహాలు, చేతులపై ఇంజెక్షన్ గుర్తులు, పెదాలు నల్లబడటం వంటి లక్షణాలను గమనించాలని సూచించారు. సమస్యను దాచిపెట్టకుండా వెంటనే పోలీసులకు లేదా డీ-అడిక్షన్ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు అమలులో ఉన్న ఎన్డీపీఎస్ చట్టం?1985 ప్రకారం గంజాయి సేవించడం, విక్రయించడం, రవాణా చేయడం, దాచిపెట్టడం వంటి నేరాలకు కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు ఉంటాయని వివరించారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ సదస్సులో సైకాలజిస్ట్ డా. విజయక్రాంతి మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలు, చికిత్స, పునరావాసంపై పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

అలాగే డ్రగ్స్ వ్యసనం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, పోలీస్ జాగృతి కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికల రూపంలో హృద్యంగా ప్రదర్శించి సందేశాన్ని అందించారు.

అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, ఏపీడీ నూరుద్దీన్, ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వేణు, జానకీరాం రెడ్డి, సతీష్, చాకలి ఐలమ్మ సమాఖ్య నాయకురాలు మమతతో పాటు ఇతర పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## హైదరాబాద్ పాతబస్తీ మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఊరేగింపు.

మిలాద్ ఉన్ నబీ (హజ్రత్ మహమ్మద్ ముస్తఫా వారి జన్మదినోత్సవం) సందర్భంగా పాత నగరం అంతటా మరియు చార్మినార్ వద్ద వేడుకలు నిర్వహించారు. మిలాద్ కమిటీ, చార్మినార్ వద్ద ఒంటెలు, బైకులు, కార్లతో పాటు ఆకుపచ్చ జెండా, భారత జాతీయ పతాకం ప్రదర్శిస్తూ, దరూద్ పాక్ పఠిస్తూ ర్యాలీ ఊరేగింపును నిర్వహించింది. ప్రతి సంవత్సరం హైదరాబాద్ యువత మరియు వృద్ధులు ఈ ఊరేగింపు ర్యాలీలో పాల్గొని ఒకరికొకరు మురక్బాద్ ఇచ్చుకుంటారు. ప్రజల భద్రత కోసం హైదరాబాద్ నగర పోలీసులు, సెంట్రల్ ఆర్పీఎఫ్ దళంతో సహా పోలీసు బలగాలను మోహరించారు. హజ్రత్ మహమ్మద్ ముస్తఫా వారి జన్మదినోత్సవాన్ని గత 1448 సంవత్సరాలుగా జరుపుకుంటున్నారు.

## మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం యువకుల రక్తదానం

ఆషికానే రసూల్ టీమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారుక్ సుబ్లి, అల్తాఫ్ బాబా కొండపల్లి పట్టణం, ముస్లింలకు అత్యంత ముఖ్యమైన పండగ మహమ్మద్ ప్రవక్త జన్మదిన ఈద్ మిలా ఉన్ నబీ సందర్భంగా కొండపల్లి ముస్లిం యువకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆషికానే రసూల్ టీమ్ ఆధ్వర్యంలో కొండపల్లి బ్యాక్ సెంటర్ లోని సరాయి ఖానా లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారుక్ సుబ్లి, సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా ప్రారంభించారు. ఫారుక్ షుబ్లి మాట్లాడుతూ దివ్య ఖురాన్లోని సూరా అల్-మాయిదా (5:32) వాక్యంలోని పవిత్రమైన సూత్రాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒక మానవుని ప్రాణాన్ని కాపాడటం అనేది సర్వ మానవాళి ప్రాణాలను కాపాడటంతో సమానమని, అలాగే కారణం లేకుండా ఒకరి ప్రాణాన్ని తీయడం సర్వ మానవాళిని అంతం చేయడంతో సమానమని స్పష్టం చేశారు. అందరికీ ఈద్ మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలిపారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా మాట్లాడుతూ ఆషికానే రసూల్ టీమ్ ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ అన్నదానాలు, సేవా కార్యక్రమాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పండగ సందర్భంగా ఆర్భాటాలకు వెళ్లకుండా సమాజానికి ఉపయోగపడే ఒక మంచి సేవా కార్యక్రమం చేయడం ఎంతో అభినందనీయమని ముస్లిం యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యువకులు స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి ఉన్నత చదువుకు అండగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నిలిచారు




బి.పీ.ఎడ్ కోర్సు మొదటి సంవత్సరం ఫీజు కోసం రూ.32,000/- రూపాయల చెక్కు అందజేత కోర్సు పూర్తయ్యే వరకు పూర్తి అండగా ఉంటానని హామీనాగర్కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన కొంగరి గౌరమ్మ, బాలస్వామి దంపతుల కుమార్తె అయిన రేవతి బి.పీ.ఎడ్ కోర్సులో సీటు సాధించింది, అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కళాశాల ఫీజు చెల్లించడం కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న మర్రి జనార్దన్ రెడ్డి గారు విద్యార్థిని రేవతి ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా బి.పీ.ఎడ్ కోర్సు మొదటి సంవత్సరం ఫీజును మాజీ ఎమ్మెల్యే శ్రీ మర్రి జనార్దన్ రెడ్డి గారు తన స్వంత నిధులు 32,000/- రూపాయల చెక్కును అందజేసి అండగా నిలిచారు. విద్యార్థిని రేవతి కోర్సును విజయవంతంగా పూర్తి చేసే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ పూర్తి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి గారు మాట్లాడుతూ, "పేదరికం ఏ విద్యార్థి కలలకు అడ్డంకి కాకూడదు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ ఒక్కరి చదువు ఆగిపోకూడదన్నదే నా ఆకాంక్ష. చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి పేద విద్యార్థికి నా వంతు సహాయం అందిస్తాను. రేవతి తన కోర్సును విజయవంతంగా పూర్తి చేసి, మంచి భవిష్యత్తును నిర్మించుకునే వరకు అండగా ఉంటాను." అని తెలిపారు. పేద విద్యార్థుల విద్యకు ఆర్థిక సహాయాలు అందిస్తూ, వారి భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తున్న మర్రి జనార్దన్ రెడ్డి గారికి విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు

## సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం- కొండా మురళి



హైదరాబాద్ కొండ సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం. ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కాంగ్రెస్ నేత -కొండా మురళి అన్నారు. బుధవారం అయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో భేటీ అయ్యారు. తరువాత మాట్లాడుతూ సుస్మితను ప్రశ్నించే హక్కు మాకు లేదు. కమిటీకి మేం చెప్పాల్సింది చెప్పాం. నేను కాంగ్రెస్లోనే కొనసాగుతానని అన్నారు.

ఓ బిల్లు విషయంలో భట్టిని కలిశా. గాంధీ కుటుంబంపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు రాలేదా. నా బిడ్డకు స్వతంత్రంగా మాట్లాడే హక్కుందని అయన అన్నారు.

## 33వ వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి



బద్వేల్ నియోజకవర్గం, బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డు గాండ్ల వీధిలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి స్థానిక కూటమి నాయకులతో కలిసి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దేశ భద్రతపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు..

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగాలంటే దేశ అంతర్గత భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాసైబర్ ముప్పులు వంటి సవాళ్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఆ సమావేశంలో అమిత్ షా భవిష్యత్ భద్రతా వ్యూహంపై కీలక సూచనలు చేశారు. వచ్చే 15-20 ఏళ్లలో దేశ భద్రతను ప్రభావితం చేసే పరిణామాలను ఇప్పటి నుంచే అంచనా వేసి వ్యూహాలను రూపొందించాలని భద్రతా, నిఘా సంస్థలను కోరారు. అక్రమ వలసదారుల అంశంపై అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఈ దేశం ధర్మశాల కాదు. ఈ దేశంలో నివసించే హక్కు కేవలం ఈ దేశ పౌరులకు మాత్రమే ఉంటుంది' అని అన్నారు. అక్రమ చొరబాట్లు దేశ భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రతా వ్యవస్థలు అక్రమ చొరబాట్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాలని సూచించారు. దేశంలోని భూ సరిహద్దుల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టిందని హోంమంత్రి తెలిపారు.

## వైద్యం పేరుతో దోపిడీ.. అమాయకుల ప్రాణాలతో చెలగాటం

**(హెచ్.ప్రతాప్)**

హైదరాబాద్‌లో అర్హతలేని వ్యక్తులు వైద్యులుగా చలామణి అవుతూ చికిత్స చేస్తున్నారనే ఆరోపణలపై ఆరుగురిని అరెస్టు చేయడం ఒక నగర నేర ఘటనగా మాత్రమే చూడటం ప్రమాదకరం. ఇది దేశంలోని ఆరోగ్య వ్యవస్థను వేధిస్తున్న క్వాకరీ అనే తీవ్రమైన ప్రజారోగ్య సమస్యకు ప్రతీక. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన దాడుల్లో ఇంజెక్షన్లు, మాత్రలు, సెలైన్‌లు, సిరంజీలు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లు, శస్త్రచికిత్స పరికరాలు స్వాధీనం చేసుకోవడం ఈ ముప్పు తీవ్రతను వెల్లడిస్తోంది.

అసలు ఆందోళన ఇక్కడితో ఆగదు. కొందరు అర్హతలేని వ్యక్తులు చిన్న క్లినిక్‌లతో మొదలుపెట్టి, కాలక్రమంలో ఆసుపత్రుల రూపంలో వైద్య వ్యాపారాలను నిర్వహించే పరిస్థితి ఏర్పడుతోంది. ఆసుపత్రి బోర్డు, తెల్లకోటు, స్టెతస్కోప్, కొన్ని మందులు ఉంటే చాలు---ప్రజల కళ్లలో 'డాక్టర్'గా కనిపించవచ్చనే ధోరణి ప్రమాదకరం. కొన్నిచోట్ల ఆసుపత్రి యజమాని అర్హతలేని వ్యక్తి కాగా, పేరు కోసం అర్హత కలిగిన వైద్యుడిని చూపించడం, వైద్య సిబ్బంది పేర్లను ఉపయోగించడం, అవసరమైన అనుమతులు లేకుండానే చికిత్సలు నిర్వహించడం వంటి అక్రమాలకు అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ముప్పు మరింత తీవ్రమైనది. సమీపంలో నిపుణులైన వైద్యులు లేకపోవడం, ప్రభుత్వ వైద్య సదుపాయాలు పరిమితంగా ఉండటం, తక్కువ ఖర్చుతో వెంటనే చికిత్స లభిస్తుందనే నమ్మకం కారణంగా అమాయక గ్రామీణ ప్రజలు ఇలాంటి వ్యక్తులను ఆశ్రయిస్తారు. ఒకప్పుడు 'ఆర్‌ఎంపీ' పేరుతో మొదలైన అక్రమ వైద్యం, కొన్ని ప్రాంతాల్లో చిన్న ఆసుపత్రులు, ప్రసూతి కేంద్రాలు, డయాగ్నస్టిక్ కేంద్రాల రూపంలో విస్తరించే ప్రమాదం ఉంది. ప్రజల వైద్య అవసరాన్ని కొందరు అక్రమ వ్యాపార అవకాశంగా మార్చుకోవడం అత్యంత ప్రమాదకరం.

ఇక్కడ బాధితుడు కేవలం రోగి కాదు---ఆరోగ్యం గురించి పరిమిత అవగాహన ఉన్న ఒక కుటుంబం. తప్పుడు నిర్ధారణతో రోజులు గడిచిపోవచ్చు. అనవసరమైన ఇంజెక్షన్లు, తప్పు మందులు, ప్రమాదకరమైన చికిత్సలు పరిస్థితిని మరింత విషమం చేయవచ్చు. చివరకు రోగి పరిస్థితి విషమించినప్పుడు అసలు సమస్య బయటపడుతుంది. అప్పటికే డబ్బు, సమయం, ఆరోగ్యం---మూడూ నష్టపోయి ఉండవచ్చు.

అంతేకాదు, అర్హతలేని వ్యక్తులు తీవ్రమైన కేసులను కూడా తమ వద్దే ఉంచుకుని, చివరి దశలో మాత్రమే పెద్ద ఆసుపత్రులకు పంపితే విలువైన సమయం వృథా అవుతుంది. గుండెపోటు, స్ట్రోక్, ప్రసవ అత్యవసర పరిస్థితులు, విషప్రయోగాలు, తీవ్రమైన ఇన్ఫెక్షన్ల వంటి సందర్భాల్లో నిమిషాల ఆలస్యం కూడా ప్రాణాంతకంగా మారవచ్చు. అందువల్ల క్వాకరీని కేవలం నిబంధనల ఉల్లంఘనగా కాకుండా ప్రాణభద్రతకు ముప్పుగా పరిగణించాలి.

అందుకే నకిలీ వైద్యుడిని పట్టుకోవడం మాత్రమే సరిపోదు. అక్రమ క్లినిక్‌లు, ఆసుపత్రులు ఎలా ఏర్పడుతున్నాయి? వాటికి అవసరమైన అనుమతులు లేకుండానే కార్యకలాపాలు ఎలా సాగుతున్నాయి? ఇంతకాలం తనిఖీ వ్యవస్థ ఎక్కడ ఉంది? అనే ప్రశ్నలకు సమాధానాలు కావాలి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల నమోదు, కనీస ప్రమాణాలు, రోగుల భద్రత కోసం ఉన్న నిబంధనలను కఠినంగా అమలు చేయాలి.

ప్రతి ఆసుపత్రి, క్లినిక్‌లో వైద్యుడి అర్హత, రిజిస్ట్రేషన్ వివరాలు, సంస్థ అనుమతులు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా చేయాలి. డిజిటల్ రిజిస్టర్ ద్వారా ఒక్క నిమిషంలో వైద్యుడి అర్హతను ధ్రువీకరించే అవకాశం ప్రజలకు కల్పించాలి. అనధికారిక వైద్యం కనిపిస్తే ఫిర్యాదు చేసే వ్యవస్థను గ్రామస్థాయికి తీసుకెళ్లాలి. స్థానిక అధికారుల తనిఖీలు కేవలం ఫిర్యాదులకే పరిమితం కాకుండా క్రమం తప్పకుండా జరగాలి.

వైద్య రంగంలో నకిలీదనం సాధారణ మోసం కాదు. అది నమ్మకాన్ని దోచుకోవడం.. ఆరోగ్యాన్ని అమ్ముకోవడం.. చివరికి ప్రాణాలతో చెలగాటం. అమాయక ప్రజల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని ఆసుపత్రుల పేరుతో వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు, వారికి అవకాశం కల్పించే వ్యవస్థపై బాధ్యత, ప్రజల్లో అవగాహన---ఈ మూడు కలిసినప్పుడే ఈ ప్రమాదాన్ని అరికట్టగలం. వైద్యం వ్యాపారం కావచ్చు; కానీ ప్రాణం మాత్రం వ్యాపార వస్తువు కాదు.

# ఖాళీగా ఉన్నటువంటి 34 వేల ఉపాధ్యాయ పోస్టులకు ఋాజ నోటిఫికేషన్ విడుదల చేయాలి

**విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య**

**ముఖ్యమంత్రికి రాజ్యసభ సభ్యులు జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు -ఆర్ .కృష్ణయ్య లేఖ**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**

**హైద్రాబాద్ ఆగస్ట్ 26** :వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా యున్న 34 వేల టీచర్ల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారి చేయాలనీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మీరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాశారు.

రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 14 వేల పాఠశాలలో ఇంగ్లీష్, మథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరు. విద్యార్థులుకు ఈ సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం లేక చదువులల్లో వెనుకబడి పోతున్నారు. దీనిలో బేసిక్ విషయ పరిజ్ఞానం లేక జాతీయ పరీక్షలలో పోటీలో నీట్, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర పోటీపరీక్షలలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలు - 14 వేల పోస్టులు గాకా ఇంకా ఎయిడెడ్ పాఠశాలలు శాలలు - 5900, ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ విద్యాశాఖ గురుకుల పాఠశాలల్లో 9000, ఆదర్శ పాఠశాలలు 3000, కస్తూర్బా పాఠశాలలు - 1500 ఇలా అన్నింటిలో కలిపి దాదాపు 34 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నవి. గెస్ట్ టీచర్స్/ పార్ట్ టైం టీచర్స్ ను నియమించి పాఠాలు చెబుతున్నారు. వీటిని భర్తీ చేయాలనీ కోరారు.ఇంకొక వైపు దీ.జు.ు, ణ.జు.ు చేసి, అన్నీ అర్హతలు గల 16 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగం లేక తమ శక్తి - యుక్తులు వృదా అవుతున్నాయి. వీరి శక్తి - యుక్తులు సమాజాభివృద్ధికి ఉపయోగించవలసిన అవసరం ఉంది.




టీచర్ పోస్టులు భర్తీ చేయక పోవడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యా తగ్గుతుంది. 30 మంది విద్యార్థులు యున్న బడులు 7,629 ఉండగా, 31 నుంచి 100 మంది విద్యార్థులున్న బడులు 9,785 ఉన్నాయి. ఈ రెండు క్యాటగిరీలను కలిపితే 100 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు 17,414కు చేరాయి. అంటే రాష్ట్రంలోని మొత్తం 23,198 పాఠశాలల్లో సుమారు 75.1% బడుల్లో విద్యార్థుల సంఖ్య 100 దాటడం లేదన్నమాట. గణాంకాలేమో ఇలా ఉంటే.. ప్రభుత్వమేమో ఎన్రోల్మెంట్ పెరిగినట్టు చెప్తున్నది. 2026-27 విద్యాసం వత్సరంలో 30వేల ఎన్రోల్మెంట్ తగ్గినట్టు లెక్కలు చెప్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో 14 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నవి. ఇటీవల జూన్ లో 8వేల మంది రిటైర్ అయ్యారు. దాదాపు గత ఆగస్టులో 4500 టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చారు. అలాగే గత డీఎస్సీలో సెలక్ట్ అయిన వారిలో దాదాపు 2వేల మంది జాయిన్ కాలేదు. ఇలా మొత్తం 14వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా యున్నవి. పెద్ద ఎత్తున్న ఖాళీలు యుంటే రైశెనైజెషన్ పేరు మీద మిగులు, టీచర్లు యున్నారని ప్రభుత్వ గోచేర్స్ ప్రచారం చేస్తున్నారు. టీచర్ పోస్టుల భర్తీని నిరుద్యోగులకు ఉద్యోగం ఇస్తున్నామనే బడ్జెటు ఖర్చు అవుతుందని కోణంలో చూడరాదు. ఈ టీచర్ల ద్వారా భావి భారత పౌరులైన భాలలను తీర్చిదిద్ది ఈ సమాజానికి ఉపయోగపడే గొప్ప వారికి తయారు చేస్తామన్నామనే కోణంలో చూడాలి. పూర్తీ స్థాయి టీచర్ పోస్టులు భర్తీ చేస్తే ప్రభుత్వ పాటశాల వ్యవస్థను బలోపేతం చేస్తే విద్యాప్రమాణాలు పెరిగి విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప నైపుణ్యం గల మానవ వనరులుగా సమాజాభివృద్ధికి తోడ్పడుతారు. విద్యార్థులను తీర్చి దిద్దితే, వారిలో ఉన్న సృజనాత్మక శక్తి, తెలివి తేటలకు సాన పెడితే గొప్ప ఇంజినీర్లు, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, సంఘ సంస్కర్తలుగా విలువ గల రాజకీయ నాయకులుగా తయరవుతారు. అప్పుడు దేశం శీఘ్ర గతిన అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు

### మదర్ థెరిస్సా 116వ జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

శాంతి, కరుణ, త్యాగానికి మారుపేరైన భారతరత్న మదర్ థెరిస్సా 116వ జయంతి సందర్భంగా కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని మోండా డివిజన్ లో బ్లూసీ హోటల్ వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి ఆయన పూలమాల వేసి అంజలి ఘటించారు.అనాథలకు, నిరుపేదలకు, రోగగ్రస్తులకు తన జీవితాంతం సేవ చేసిన మహనీయురాలు మదర్ థెరిస్సా అని కొనియాడారు. ఆమె చూపిన ప్రేమ, మానవత్వ మార్గం నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆమె సేవా నిరతిని స్ఫూర్తిగా తీసుకుని, తోటివారికి సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ

# హైదరాబాద్ విమోచన చరిత్రను ప్రతి ఇంటికీ చేరుస్తాం

**: మాజీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ డా. బూర నర్సయ్య గౌడ్**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 26;తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు, అణచివేతకు గురైందని, దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల రక్తచరిత్ర నుంచి తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17నే విమోచనం లభించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ డా. బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం పాలన కింద ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో సెప్టెంబర్ 17ను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తుంటే, పోరాటానికి కేంద్రబిందువైన తెలంగాణలో మాత్రం అమరవీరులకు అధికారిక గుర్తింపు ఇవ్వకపోవడం చారిత్రక అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో 1969 తొలిదశ ఉద్యమంలో 369 మంది, మలిదశలో దాదాపు 1,200 మంది బలిదానాలు చేశారని, రాష్ట్రం ఏర్పడి 13 ఏళ్లు గడుస్తున్నా అమరవీరుల స్థూపానికి తాళాలు వేసి ఉండటం, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.



సుందర్‌లాల్ కమిటీ నివేదిక ప్రకారం విమోచన పోరాటంలో సుమారు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, నిజాం పాలన ముగిసినా గడీల రాజకీయ సంస్కృతి కొనసాగుతోందని బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. తెలంగాణ విమోచన పోరాటం ఏ ఒక్క మతానికో సంబంధించింది కాదని, నిజాం అకృత్యాలకు వ్యతిరేకంగా కలం పట్టిన ముస్లిం జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్‌ను రజాకార్లు పొట్టనబెట్టుకున్న ఉదంతమే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు, అప్పీజ్మెంట్ రాజకీయాల కోసం ఎంఐఎంకు తలొగ్గి చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని, మరోవైపు కమ్యూనిస్టు పార్టీలు కూడా తమ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా విమోచన ఉత్సవాలు నిర్వహిస్తోందని, అదే స్ఫూర్తితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సూచనల మేరకు విమోచన చరిత్రను ప్రతి గడపకూ చేర్చేందుకు 'తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ' ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణను రూపొందించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన సాధన కోసం బీజేపీ తరఫున 7 ప్రధాన డిమాండ్లను ఆయన రాష్ట్ర ప్రభుత్వం ముందుంచారు:సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి.

విమోచన ప్రదాత సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారీ స్మారక చిహ్నం 'స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్ -- తెలంగాణ'ను హైదరాబాద్‌లో నెలకొల్పాలి.

అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ విమోచన మ్యూజియం' ఏర్పాటు చేయాలి.

ప్రతి జిల్లా కేంద్రంలో 'తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం' నిర్మించాలి.

తెలంగాణ విమోచన చరిత్రను అధికారిక పాఠ్యపుస్తకాలలో చేర్చాలి.

అమరవీరులు, ఉద్యమకారుల సమగ్ర జాబితాను రూపొందించి వారికి, వారి కుటుంబాలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాలి.

వీరభైరాన్‌పల్లి, పరకాల (డెక్కన్ జలియన్‌వాలాబాగ్), కడవెండి, జోడేఘాట్, నిర్మల్, నల్గొండ వంటి చారిత్రక ప్రాంతాలను కలుపుతూ 'తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్'ను అభివృద్ధి చేయాలి.

అదేవిధంగా, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం బీజేపీ 5 కీలక ప్రతిజ్ఞలను ప్రకటించిందని తెలిపారు

రజాకార్ రాజకీయ వారసత్వ కలయిక అయిన ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కూటమికి చరమగీతం పాడటం.

శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రమంతటా పన్నులు, చట్టాల అమలులో సమానత్వం ఉండేలా "ఒకే రాష్ట్రం -- ఒకే రూల్" విధానాన్ని తీసుకురావడం.

అదేవిధంగా ఈ ఆగస్టు 27న వీరభైరాన్‌పల్లిలో, సెప్టెంబర్ 2న పరకాల అమరధామంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటమని, పార్టీలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ చరిత్ర పునరుజ్జీవన యజ్ఞంలో భాగస్వామ్యం కావాలని డా. బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, విమోచన కమిటీ సభ్యులు శ్రీ కప్పర ప్రసాద్ రావు, సందీప్ సాయి, అధికార ప్రతినిధి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గిడుగు రామూర్తి పంతులు పాత్రలోఎన్వీ రఘువీరప్రతాప్ నటించిన బయోపిక్ నిర్మాణం









**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: హైద్రాబాద్ ఆగస్ట్ 26;**గిడుగు వెంకట రామూర్తి పంతులు గారి 164 వ జయంతి సందర్భంగా ప్రముఖ సినీ దర్శకులు నిట్టల గోపాలకృష్ణ దర్శకత్వంలో మొట్ట మొదటి సారిగా ప్రముఖకవి రచయిత, నటుడు ఎన్వీ రఘువీరప్రతాప్ గిడుగు రామూర్తి పంతులు పాత్రలో నటించిన బయోపిక్ నిర్మాణం జరిగింది. పలువురు ఈ బయోపిక్ పై ప్రశంశాలు కురిపించినారు. ఇది జాతీయ స్థాయి అవార్డు అందుకోబోయే బైయోపిక్ అని పెద్దలు కొనియాడారు.

### రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్‌గ్ర్భాంతి

హైదరాబాద్ సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగ్ర్భాంతి వ్యక్తం చేసారు. కోదాడ మండలం ద్వారకుంట దగ్గర కంటైనర్ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ ను ఆదేశించారు.

# చిన్నపత్రికలుసమాజానికి దారి చూపే దీపాలు'అనే అంశం పై ఇష్టాగోష్టి




హైద్రాబాద్ ఆగస్ట్ 26; సమాచార భారతి ఆద్వర్యం లో ఈ నెల 30 న లి'చిన్న పత్రికలుసమాజానికి దారి చూపే దీపాలు'లిఅనే అంశం పై పబ్లిషర్లు, సంపాదకుల ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచార భారతి సంస్థ ఇడుదల చేసిన ప్రకటలో పేర్కొంది. ఆబిడ్స్ లోని స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాల జరిగే ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త గా RSS క్షేత్ర ప్రచారక్భ భరత్ కుమార్ పాల్గొంటున్నట్లు తెలిపింది.

# హనుమాన్ సేవ సమితి ఆధ్వర్యంలో సన్మానం



కమాన్ పూర్ ఆదివారహస్వామి జన్మదినోత్సవాలు భాగంగా నాలుగు రోజులపాటు స్వామి వారి వివిధ కార్యక్రమాలను దగ్గరుండి జరిపించి మరియు భక్తులకు ఎటువంటి లోటు లేకుండా కమాన్ పూర్ ఆదివారహ స్వామి గుడి కి ఒక వన్నె తెచ్చిన అర్చకులు శ్రీ వరప్రసాదాచార్యుల వారికి శ్రీ హనుమాన్ సేవా సమితి కమిటీ సభ్యులు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు చిర్రసత్యం , అధ్యక్షులు సుద్దాల కృష్ణమూర్తి, పిన్ రెడ్డి కిషన్ రెడ్డి జంగ పెల్లి అజయ్ మరియు కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ, మెట్టు సాంబమూర్తి, పంజా సాయిరాం మల్యాల మహేష్, యూసుఫ్ లల్లు, కోలేటి సురేష్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

# శీను బాబు సమక్షంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జన్మదిన వేడుకలు.



కమాన్ పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ జన్మదిన వేడుకలు పిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు సమక్షంలో బుధవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ ఆదివారా స్వామి ప్రాంగణంలో సయ్యద్ ఇక్బాల్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శీను బాబు సమక్షంలో కేక్ కట్ చేసి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ సయ్యద్ అన్వర్, సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, అంబిలి శ్రీనివాస్, రెబల్ రాజ్ కుమార్, కిషన్ రెడ్డి, ఉప సర్పంచ్ సోహెల్, జెమినీ గౌడ్, మల్యాల మహేష్ గౌడ్, లల్లు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# మోటార్ సైకిల్ ను ఢీకొట్టిన టిప్పర్ - టిడిపి నాయకుడు మృతి



బేతంచెర్ల : బేతంచెర్ల నుంచి కర్నూలుకు వెళ్లే జాతీయ రహదారిపై టిప్పర్ ఢీకొని టిడిపి నాయకుడు నాగ విజయప్ప మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని ఎంబాయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ టిడిపి నాయకుడు నాగ విజయప్ప70.సం బేతంచెర్లకు వ్యక్తి గత పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అతివేగంతో కర్నూలు వైపు నుంచి బేతంచెర్ల వైపు వస్తున్న టిప్పర్ నాగ విజయప్ప,ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



కమాన్ పూర్ రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో బుధవారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థలో అమలులో ఉన్న ఎల్ 1, ఎల్ 2, విధానం కారణంగా ఓ.బి, అండర్ గ్రౌండ్ సివిల్ పనులలో, పరికరాల పని ముట్లలో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయని, ప్రస్తుత ఎల్ 1, ఎల్ 2, పూర్తిగా పునః సమీక్షించి, నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా అమలు చేయడం, సింగరేణి వ్యాప్తంగా ఒకరి క్వార్టర్ లో మరొకరు ఉంటున్నారని అన్ని క్వార్టర్లను క్రమబద్రికరించి ఎవరైతే క్వార్టర్లో ఉంటున్నారో వారికి పర్మనెంట్ చేయడం, ఐ ఈ డి లెక్కల ప్రకారం అడ్డలా లాంగ్వాల్ గనిలో అదనంగా ఉన్న ఎలక్ట్రిషన్, ఫిట్టర్ లను, ఘనంగా ఉన్న సిబ్బందిని అవసరానికి అనుగుణంగా ఓ సి పి 1, ఓసిపి-2 లకు బదిలీ చేయడం, సెంటినరీ కాలనీలో గల క్వార్టర్స్ నిర్మించి చాలా కాలం అవుతున్న కారణంగా తరచూ మరమ్మత్తులు అవుతున్నాయి కాబట్టి సివిల్ విభాగం కు తగినంత మాన్ పవర్ ను ఇచ్చి క్వార్టర్ల మరమ్మత్తులను సకాలంలో చేపట్టేలా చర్యలను తీసుకోవడం, ఓసిపి-1 ఎస్ అండ్ డి విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ద్విచక్ర వాహన పార్కింగ్ కోసం షెడ్డు ను నిర్మించడం, ఆర్ జి త్రీ, ఏపీఏ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అర్జీ -2 ఏరియా లోనీ ఉద్యోగులతో సమానంగా క్వార్టర్స్ కౌన్సిలింగ్ లో అవకాశం కల్పించడం, ఇష్టం లేని పదోన్నతి వద్దని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని పదోన్నతి రద్దుచేసి వారిని యధా ప్రకారం వారి డెసిగ్నేషన్ లలో కొనసాగించడం, ఓసిపి-1 ఉత్పత్తి, రోజువారి కార్యకలా పాలకు అవసరమైన స్థాయిలో డోజర్ లను అందుబాటులో ఉంచడం, వర్షపు నీరు నిలవడం వల్ల సిహెచ్పీ కాంట గేట్ ప్రాజెక్ట్ ఆఫీస్ గేటు వరకు గల రహదారి, కాంపౌండ్ ఫెన్సింగ్ వెంబడి ఉన్న సైడ్ డ్రెయిన్ క్లియర్ చేయడం, వర్షపు నీరు సక్రమంగా వెళ్లి పోయేలా చర్యలు తీసుకోవడం, సెంటినరీ కాలనీలో కోతులు, వీధి కుక్కలు, పందుల బెడద విపరీతంగా పెరిగిందని కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి నియంత్రణకు తక్షణ, శాశ్వత చర్యలు తీసుకోవడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిఎంలు మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జి.తిరుపతి, కె.సాయికృష్ణ, ఎన్.శ్రీనివాస రావు, ఎస్వో టుజియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు కె.జనార్దన్, జి.శంకర్, ఐ ఇ డిజిఎం బి.టి. మురళీకృష్ణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజినీర్ ప్రకాష్, సిహెచ్పి డిజియం జి.శ్రీనివాస్, ఐ టి డిప్యూటీ మేనేజర్ ఆర్.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో కొత్త పింఛన్లు! ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కోడుమూరు మండల పరిధిలోని ప్యా లకుర్తి గ్రామంలో ,మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన డోర్ టు డోర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి, ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాల గురించి, అభివృద్ధి పనులు గురించి గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న లబ్ధిదారులకు నూతనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందిస్తున్నట్లు,వచ్చే సెప్టెంబర్ మొదటి వారంలో అధికారికంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని లబ్ధిదారులకు తెలియజేశారు. లబ్ధిదారులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్కు కావలసిన అర్హత పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, విజయ్ కుమార్ యాదవ్, ఉగాది వెంకటేశు, మరియు మండల స్థాయి నాయకులు, గ్రామస్థాయి నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# 31, 1 తేదీల్లో నీట్ యూజీ స్పోర్ట్స్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రాష్ట్రంలోని వైద్య, దంత కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద ప్రవేశానికి స్పోర్ట్స్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 31, సెప్టెంబరు ఒకటో తేదీన ఉంటుందని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్ తెలిపారు. ఇప్పటికే స్పోర్ట్స్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల క్రమాన్ని (నీట్ యూజీ మార్కుల ఆధారంగా) విశ్వవిద్యాలయం విడుదల చేసింది. విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ హాల్లో 31న 1-125 వరకు, సెప్టెంబరు 1న 126 నుంచి ఆఖరి అభ్యర్థి 249 నంబరు వరకు హాజరుకావాల్సి ఉంటుంది.

# ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట -జి. తిమ్మారెడ్డి(నీటి సంఘము చైర్మన్)





పాములపాడు మండలంలోని, మద్దూరు గ్రామంలో ఈరోజు నూతనంగా గంగమ్మ విగ్రహం ప్రతిష్ట చేశారు. అలాగే ఈ గ్రామ పంచాయతీలోని, మద్దూరు, కృష్ణానగర్, పెంచికలపల్లె గ్రామాలలో విగ్రహ ప్రతిష్టకు ముందు వీధి వీధిన గ్రామ పొలిమేరల నందు, సన్నాయి మేళాలతో వేదమంత్రాలు నడుమ, ఘనంగా విగ్రహాలను ఊరేగింపు చేశారు. అనంతరం మద్దూరు గ్రామంలో నీటి సంఘం చైర్మన్ జి.తిమ్మారెడ్డి దంపతులు మరియు మద్దూరు, కృష్ణానగర్, పెంచికలపల్లె గ్రామాల ప్రజలందరూ కలిసి విగ్రహం ప్రతిష్టించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు జి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ అందరి రైతులకు పాడిపశువుల యందు, పంటల యందు, నీటి ఎద్దడి లేకుండా గంగమ్మ తల్లి దీవెనలతో కరుణించి మన అందరిని సుఖ సంతోషాలతో దీవించాలని కోరుతున్నామని అన్నారు.

# యుగయుగాలలో లోక పాలనకై, ధర్మ సంస్థాపనకై విష్ణువు



నల్లందిగేల్ లక్ష్మి నరసింహా చార్యులు



**యాదాద్రి : హైదరాబాద్:ప్రజాభలం ప్రతినిధి.** యాదాద్రి లక్ష్మి హైగ్రీవ సన్నిధి వేద పాఠశాలలో కొలుఉతిరూన్నటువంటి లక్ష్మి హైగ్రీవా స్వామి వారి వార్షికమైనటివసంటి పంచగా దీక్ష తో ఏక కుందాత్మంగా శ్రీ హైగ్రీవా మహా యాగం జరుగుతుంది శ్రావణ పౌర్ణమి నాడు హైగ్రీవ జయంతి మహోత్సవం మహా గాయత్రీ అమ్మవారి జయంతి మహోత్సవం లను పురస్కరించుకొని చేతుర్వేద పారాయణలు దివ్య ప్రభాందా పురాణ హితీహాస పారాయణసలు మూల మంత్ర ముక్తి మంత్ర జపాలు జరుగుతూ స్వామి వారికీ శత ఘటభిషేకం ముహత్సవము తో ఈ కార్యక్రమం ముగుస్తుంది. ఈ కార్యక్రమం ప్రత్యేకంత విద్యార్థుల నాలుకపైన బీజక్ష రాలు లోకించమనేటటువంటి ఈ క్షేత్రం యొక్క ప్రత్యేకత, ఈ హైగ్రీవా స్వామి వారు సరస్వతి కి ముప్పై మూడు కోట్ల దేవతలకు గురు అవతారంగా అవతరించిన అవతారం ఈ అవతారం విశిష్టం చాలా గొప్పనైనాటువసంటి, చదువు సంస్కారం విద్యా అనుటటువంటి ఈ స్వామి దర్శించటం మాత్రమే కలుగుతాయి, ఈ ఆలయం యాదాద్రి లో యాదాద్రి వంగపల్లి మధ్యలో కొలువైనటువంటి ఉంది. అందరు భక్తులు అందరు విచ్చేసి స్వామి వారి కటాక్షం పొంది భోజనాలు స్వీకరించాలని. కోరారు నల్లందిగేల్ లక్ష్మి నరసింహ చార్యులు వ్యవస్థాపక మహాదాచార్యులు తెలియజేశారు. యాదాద్రి (యాదగిరిగుట్ట) సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయం విద్యకు, జ్ఞానానికి అధిపతి అయిన హయగ్రీవునికి అంకితం చేయబడింది. ఈ

ఆలయ విశేషాలు మరియు ప్రాముఖ్యత

జ్ఞాన దేవుడు: హిందూ సంప్రదాయంలో లక్ష్మీ హయగ్రీవుడు విష్ణువు యొక్క విజ్ఞాన అవతారం. ఈ స్వామిని ఆరాధిస్తే చదువులో రాణిస్తారని భక్తుల నమ్మకం.

క్షేత్రం ప్రత్యేకత: యాదాద్రి ప్రధాన క్షేత్రానికి చేరువలో,

వంగపల్లి వెళ్లే మార్గంలో ఈ ఆలయం ఉంది. ఇక్కడ ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది.

అక్షరాభ్యాసాలు: చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడానికి ఈ ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా శ్రవణ నక్షత్రం రోజులలో ఇక్కడ విశేష పూజలు జరుగుతాయి.

వేద పాఠశాల: ఈ ఆలయ సన్నిధిలో వేద పాఠశాల కూడా కొనసాగుతోంది. ఇక్కడ వేద విద్యను అభ్యసింపజేస్తూ నిత్య పూజలు, గోసేవలు నిర్వహిస్తారు.

విశేషం :

అనేక అవతారాలను దాల్చాడు. అయితే తన భక్తుల కోసం విష్ణువు దాల్చిన అవతారల్లోకి ఒకటి 'హయగ్రీవావతారం' ప్రముఖమైనది. అన్ని రకాలైన అభ్యాసం మరియు జ్ఞానం ఆయనలో మూలం మరియు అతని నుండి ఉద్భవించాయి. శ్రీ హయగ్రీవుడి అవతారం శ్రీమన్నారాయణుని ఇతర అవతారాలన్నింటిలో అగ్రస్థానం ఇవ్వబడింది. ఈ అవతారం దుష్ట శిక్షణ, శిష్ట రక్షణతో పాటు సకల మానవాళికి అజ్ఞానమనే అంధకారం నుండి ఖీఇ జ్ఞాజ్యోతుల దిశగా తీసుకువెళుతుంది. హయగ్రీవుడు మానవాళికి జ్ఞానప్రదాతగా కొలవబడుతున్నాడు. ఈ స్వామి దివ్యరూపం కాస్త విచిత్రంగా వుంటుంది. హయము అనగా గుర్రము. హయశీర్షుడు అనగా గుర్రపు తల కలవాడు. తెల్లని తెలుపు మానవ శరీరం, గుర్రం (అశ్వము) యొక్క తల, నాలుగు చేతులు. శంఖము, చక్రము పై రెండు చేతులలో కలిగి యుండును. క్రింది కుడి వ్రేళ్ళు జ్ఞాన ముద్రలో అక్షరమాలను కలిగి ఉంటాయి. ఏడమ చేతిలో పుస్తకము ఉంటుంది. శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. ఈ అవతారంలో స్వామి వేదాలను ఉద్ధరించారు. బి అందువల్ల, వేదాలతోపాటు సమస్తమైన వాఙ్మయానికి, జ్ఞానానికి హయగ్రీవుడు అధిపతి అయ్యాడు. ఈ అవతారంలో స్వామి గుర్రం ముఖం, మానవ శరీరం కలిసిన రూపంలో దర్శనమిస్తాడు. స్వామి వామాంకం మీద లక్ష్మీదేవి ఆసీనురాలై ఉంటుంది. స్వామిది తెల్లటి శరీర ఛాయ. నాలుగు చేతుల్లో శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకాలను ధరించి భక్తులను అనుగ్రహిస్తూ ఉంటాడు.

భగవంతుని ఇతర అన్ని అవతారాలలో భగవంతుడు కొన్ని ముఖ్యమైన సత్యాన్ని బోధించడం జరిగింది

అయితే హయగ్రీవ అవతారంలో మాత్రమే సాధకుడు వేదాంత సత్యాలన్నింటినీ పూర్తిగా గ్రహించగలడు. హయవదన నాటిదని చెబుతారు. అవతారం కృతయుగంమంది ఋషులు జ్ఞానాన్నియుగయుగాలుగా, చాలామరియు ఆధ్యాత్మిక పరిపూర్ణతను పొందడానికి భగవంతునియొక్క ఈ రూపాన్ని ధ్యానించారు అని మన పురాణాలలోవుంది.

భాద్రపదనెలలో వచ్చే శ్రావణ పూర్ణిమ హయగ్రీవ స్వామి అవతరించిన రోజుగా మన పురాణాలలో చెప్పబడింది. ఉన్నత చదువు, లౌకిక విషయాలను అధ్యయనం ప్రారంభించినప్పుడు హయగ్రీవ స్వామిని తప్పక పూజించాలి. విద్యార్థులు హయగ్రీవ స్వామిని ప్రతి రోజు ద్యానించాలి. ఆ స్వామి యొక్క ధ్యాన శ్లోకం ఈ విధంగా వుంది.

"జ్ఞానానంద మయం దేవం నిర్మల స్పటికాకృతిమ్।

ఆధారాం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే ॥

జ్ఞానం, ఆనందం, మూర్తీభవించిన దైవస్వరూపం హయగ్రీవుడు. నిర్మలమైన స్పటికాకృతి కలిగి సర్వవిద్యలకు ఆధారభూతమైన విద్యాధిదేవత హయగ్రీవునకు నమస్కారరం. హయగ్రీవుడిని పూజించిన భక్తులకు విద్యనే

ఈ శ్లోకం వాస్తవానికి పంచరాత్ర ఆగమాలకు చెందినది కానీ ఇప్పుడు 13వ శతాబ్దానికి చెందిన కవి-తత్వవేత్త వేదాంత దేశిక యొక్క హయగ్రీవ స్తోత్రానికి ఉపసర్గగా ఉంది అని వివిధ గ్రంధాల ద్వారా తెలుస్తోంది.

హయగ్రీవ అవతారం గురించి పలు పురాణ కథలు ప్రచారంలో వున్నాయి. మొదటిది : మధుకైటభులనే రాక్షసులు వేదాలను అపహరించి, పాతాళంలో దాచి పెడతారు. వేదాలు లేనిదే సృష్టికార్యం చేయలేనని బ్రహ్మదేవుడు విష్ణుమూర్తికి విన్నవించుకుంటాడు. వెంటనే, శ్రీమహావిష్ణువు హయగ్రీవ అవతారంలో పాతాళానికి వేదాలను రక్షించి, చేరి, మధుకైటభులను వధించి, బ్రహ్మదేవుడికి తిరిగి అప్పగిస్తాడు.

ఇంకొక కథలో దానవులతో యుద్ధం చేసి అలసిన విష్ణువు అల్లెతాడు (నారితాడు) గడ్డం కింద ఉంచుకొని నిద్రపోతుంటాడు. దేవతల కోరిక మేరకు, శివుడు భ్రమర రూపం ధరించి, అల్లెతాటిని కొరుకుతాడు. చివాలున తెగిన రూపం ధరించి, అల్లెతాటిని కొరుకుతాడు. చివాలున తెగిన అల్లెతాటి వేగానికి విష్ణువు శిరస్సు శరీరం నుంచి వేరుపడుతుంది. విచారించిన దేవతలు, గుర్రపు తల తీసుకువచ్చి, విష్ణువుకు అతికించి, ఆయనను పునర్జీవితుడిని చేస్తారు.

మరొక కథలో పూర్వం గుర్రపు తల ఉన్న ఓ రాక్షసుడు ఉండేవాడు. తనలాగే గుర్రపు తల ఉన్న వ్యక్తి చేతిలోనే తనకు మరణం ఉండాలన్న వరం ఆ రాక్షసునికి ఉంది. దాంతో అతన్ని సంహరించేందుకు విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ఎత్తినట్లు తెలుస్తుంది. హయగ్రీవుని ఆరాధించడం వలన జ్ఞానము, విజయం లభిస్తాయన్నది పెద్దల మాట.

హయగ్రీవుడు సకల దేవతాస్వరూపం అని కూడా వేదాలు చెబుతున్నాయి. ఆ స్వామి కృప వలనే ఈ లోకానికి లలితా సహస్రనామం, దుర్గా త్రిశతి మొదలైన శ్లోక సంపుటి అందాయి. సాక్షాత్తు హయగ్రీవస్వామి అగస్త్య మహర్షికి శక్తి ఉపాసనా రహస్యాలను బోధించినట్లు బ్రహ్మాండ పురాణంలో ఉంది. ఆధ్యాత్మిక ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన లలితా సహస్రనామాలు హయగ్రీవుడి వల్లే లోకంలో వ్యాప్తిచెందాయి.

## మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహణ



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 26 ఏటూరు నాగారం** ఏటూరునాగారం: ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని పచ్చ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.

మిలాద్ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రజలకు వివరించారు. మత సామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వం సమాజంలో మరింత బలపడాలని ఆకాంక్షించారు. ర్యాలీలో మతపెద్దలు, ముస్లిం మైనారిటీ నాయకులు, యువకులు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## పండుగను ప్రశాంత వాతావరణంలో జరిపుకుందాం




చిట్వేలి వినాయకచవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేందుకు అందరూ సహకరించాలని చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఉత్సవ కమిటీల సభ్యులకు సూచించారు. పోలీసు స్టేషన్ ప్రాంగణంలో బుధవారం వినాయకచవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకొని విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే ప్రాంతంలో విగ్రహాలు ఏర్పాటుచేయాలని అన్నారు. రాత్రి 10గంటల నుండి ఉదయం 6గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, డిజే లు నిర్వహించరాదు అన్నారు. బాణాసంచా వినియోగంలో నిబంధనలను పాటించాలని, రాజకీయ పార్టీల పాటలు, ఫొటోలు, జండాలు, నినాదాలు, పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదు అన్నారు. బలంతంగా విరాళాలు వసూలు చేయరాదని, నిమజ్జనంలో ఉపయోగించే వాహనాలను ముందుగా ఏర్పాటు చేసుకొని పోలీసులు అనుమతించిన మార్గం, తేదీ, సమయంలో మాత్రమే చేరాలన్నారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు, ఇరుగు పొరుగు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సినబాధ్యత కమిటీలదే అంటూ ఇందుకు భిన్నంగా వ్యవహారిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ ఐ. వినోద్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## నూతన వధువుకు మల్లి బాబు యాదవ్ ఆశీర్వాదం.



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 26 ప్రజాబలం:** వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు శైలజయాదవ్ ల కూతురు మౌనిక- హరికృష్ణ( వేంసూరు మండలం అడవి రామన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు మహాలక్ష్మి ల కుమారుడు) ల వివాహం రేపు జరగనున్న సందర్భంగా బుధవారం నాడు జరిగిన వివాహ ప్రధానశీ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ ప్రధాన కార్యక్రమంలో పాల్గొని కలకాలం చల్లగా, అన్యోన్య దాంపత్యంతో సుఖ జీవనంతో, సంతోషంగా ఉండాలనినూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న యాదవులు అడిగిన వాటికి సమాధానంగా యాదవులు రాజకీయంగా చైతన్యం కావాలంటే ముఖ్యంగా యాదవులు ఐక్యత భావం కలిగి ఉండాలని, యాదవుల అభివృద్ధి కోసం జరిగే కార్యక్రమాలకు రాజకీయాలు వర్గాలకతీతంగా పాల్గొంటే మన హక్కులు మనం సాధించుకోవడానికి అదొక అవకాశం గా మలుచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం, అఖిలభారత యాదవ జిల్లా మహాసభ యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, దుబాకుల శ్రీనివాసులు యాదవ్, మూడు ముంతల గంగరాజు, గజ్జి సూరిబాబు, వెంకటనారాయణ, నరేష్, రామారావు,మరియు, బంధువులు ,తదితరులు పాల్గొన్నారు

## జలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు..
## సీఎం చంద్రబాబు కీలక ప్రకటన



ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పనిలేకుండా ఆన్‌లైన్ సేవలు సులభతరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. దీని కోసం ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్‌చైన్ వంటి సాంకేతికతలను వినియోగించుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రజలు ఇకపై ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సేవలు అందించాలన్నారు. సీఎం చంద్రబాబు అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల పనితీరు, పురోగతిపై సమీక్ష చేశారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1204 సేవలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.. ఈ సేవలకు సంబందించిన డేటా ఎంట్రీ సమాచారాన్ని సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేయకుండా డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచించారు.

## దోమలతో విష జ్వరాలతో అల్లాడుతున్న గ్రామ ప్రజలు

## గ్రామంలో నమమాత్రంగా గడ్డి మందు పిచికారి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల పరిధిలోగల యస్, ఇటిక్యాల,గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామంలో నామమాత్రంగా అక్కడక్కడ గడ్డి మందు పిచికారి చేసినప్పటికీ, అన్ని వార్డులలో మిగిలిపోయిన గడ్డి, విపరీతంగా పెరిగిపోవడంతో ఎస్, ఇటిక్యాల, గ్రామంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి, ఈవిషయమై గ్రామ సర్పంచ్ కు, వివరించిన వారు సానుకూలంగా స్పందించి గ్రామంలో మిగిలిన ప్రదేశాలలో గడ్డి మందు పిచికారి చేయిస్తా అని చెప్పి రెండు వారాలు గడుస్తున్న, ఇప్పటివరకు గ్రామంలో ఎలాంటి మందు పిచికారి చేయలేదు, దీంతో గ్రామంలోని ప్రజలు దోమలబాధతో విష జ్వరాల బారినపడి అనారోగ్యాలకు గురవుతున్నారు, ఇప్పటికైనా గ్రామపంచాయతీ సర్పంచ్ స్పందించి, గ్రామంలో దోమల మందు పిచికారి చేయాలని, గ్రామస్తులు కోరుతున్నారు.....

## మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు

## పుల్కల్ మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు హరీష్ కుమార్ ఆధ్వర్యంలో



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 26 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గం నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కార్యదర్శులు, పుల్కల్ మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు హరీష్ కుమార్ ఆధ్వర్యంలో, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఈరోజు బుధవారం కలవడం జరిగింది, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు మంత్రిని కలిసి, కరెంట్ బిల్లు ఇతర సమస్యల గురించి, మంత్రికి వివరించి వారితో మాట్లాడి వినతి పత్రం సమర్పించడం జరిగింది, దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి, మీకున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని మంత్రి మాట ఇవ్వడం జరిగింది, ఈకార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా యువత అధ్యక్షులు మహేష్, పుల్కల్ మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు హరీష్,శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, కోశాధికారి శివలింగం, మరియు సలహాదారులు తదితరులు పాల్గొన్నారు...

## గంజాయి నివారణకు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు




**జహీరాబాద్, ఆగస్టు 26 ప్రజాబలం ప్రతినిధి:** యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా అడ్డుకట్ట వేసేందుకు హద్నూర్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సంగారెడ్డి నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి న్యాల్కల్ మండలం చినేగేపల్లి, గణేశ్‌పూర్ గ్రామాల్లో బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద ప్రాంతాలు, పరిసరాలను డాగ్ స్క్వాడ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా హద్నూర్ ఎస్ఐ సుజిత్ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఏదైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.




## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 26(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్, గ్రామంకోటపల్లి నర్సింలు కుమారుని వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నూతన వధూవరులు గా పెద్దల ఎదుట సంఘము ఎదుట దైవ సేవకుల ఎదుట బంధుమిత్రుల సమక్షంలో అంగరంగ వైభవంగా దైవ సేవకులు వివాహ మహోత్సవం జరిపించినట్టు తెలిపారు వివాహ కార్యక్రమానికి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, మర్పల్లి మండల పార్టీ అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, మరియు మర్పల్లి మండల టిఆర్ఎస్ కుటుంబ సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి మా ఆదిత్యము స్వీకరించి పెళ్లి కార్యానికి విచ్చేసిన పెద్దలకు సీనియర్ నాయకులకు సర్పంచులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా శుభాభివందనాలు తెలియపరుస్తున్నాను అని యువ నాయకుడు వికాస్ ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు

## తుమ్మలపల్లి పాండు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్,



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 26(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు మన్నే జ్యోతి పాండు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభోత్సవం చేసి దంపతులకు నూతన వస్త్రాలు అందించిన తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ కార్యక్రమానికి మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాముల యాదవ్,మర్పల్లి మండల పెద్దలు నాయకులు మా గృహప్రవేశ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ కుటుంబ సభ్యులకి పేరుపేరునా ధన్యవాదాలు తెలియపరుస్తున్నాను అని తుమ్మలపల్లి యువ నాయకుడు మన్నే పాండు తెలిపారు



## మర్పల్లి ప్రవక్త పుట్టినరోజు ప్రపంచానికే సంతోషకరమైన పర్వదినం అంటున్న మొహమ్మద్ గౌసో ద్దీన్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 26 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లిలో మొహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు ప్రపంచానికే సంతోషకరమైన రోజు అని పెద్దలు మొహమ్మద్ గౌసో ద్దీన్ తెలిపారు ఈ పండుగ ప్రేమ సహనం శాంతి సమరసాలను బోధించిన మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని శాంతియుతంగా సంతోషంగా పండగ జరుపుకోవడం జరుగుతుందని మొహమ్మద్ సలీముద్దీన్ తెలిపారు ఈ పండుగని ముస్లిం సహోదరులు అందరూ కలిసి ఐక్యమత్యంతో సంతోషంగా పండగ సంబరాలు జరుపుకున్నట్టు తెలిపారు పండగ సంబరాల్లో పోలీసు అధికారులు మైనార్టీ కమిటీ పెద్దలు యవనస్తులు అందరూ కలసి ఎంతో సంతోషంగా సమాధానముతో జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నట్టు రాయల్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మొహమ్మద్ గౌసోద్దీన్ తెలిపారు



## జమ్మికుంట కేరళ పాఠశాలలో ఘనంగా ‘ఓణం’ వేడుకలు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 26**జమ్మికుంట పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఓణం పండుగ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.కేరళ రాష్ట్ర సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను పాఠశాలలో ప్రతి ఏటా శ్రావణ మాసంలో ఎంతో ఉత్సాహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

వేడుకల్లో భాగంగా పాఠశాల చైర్మన్ కే ఏస్ బెన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థులకు చదువుతో పాటు వివిధ ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించడానికే ఇటువంటి పండుగలను పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం షురూ!

మంచిర్యాల జిల్లాలో ఆగస్టు 31 నుంచి 40,000 మంది ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సింగరేణి సీఎస్ఆర్ నిధులు, హరేకృష్ణ ఫౌండేషన్ సహకారంతో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆటోమేటెడ్ సెంట్రలైజ్డ్ కిచెన్ సిద్ధం చేశారు.

# శ్రీ డాకూరి శివశంకర్ రాజకీయ ప్రస్థానం

## ప్రజాసేవ-పార్టీ అనుబంధం-యువ నాయకత్వంతో ప్రత్యేక గుర్తింపు








**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్ట్ 26 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** జోగిపేట పట్టణానికి చెందిన శ్రీ డాకూరి శివశంకర్,అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీతోసుదీర్ఘఅనుబంధం కలిగిన యువ నాయకుడిగా గుర్తింపు పొందారు.ప్రజా సమస్యలపై స్పందించడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, యువతను సమన్వయం చేయడం, కార్యకర్తలకుఅందుబాటులో ఉండటం వంటి అంశాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధానంగా కనిపిస్తాయి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జోగిపేటలో 1 వ వార్డు కౌన్సిలర్ గా ( అందోలు - జోగిపేట మున్సిపాలిటీ) కి సేవలందించిన శివశంకర్ , ప్రజా సమస్యలను స్థానిక సంస్థల వేదికగాప్రస్తావిస్తూ ప్రజల తరఫున తన బలమైన వాణిని వినిపించారు,విషయపరిజ్ఞానం , వాగ్ధాటి,సమయస్పూర్తి,ప్రజల తో, సన్నిహిత సంబంధాల కారణంగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది.పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్నితానై నిర్వహించిన యువ గర్జన సభను విజయవంతం చేయడంతో పాటు, గౌరవనీయులు కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు, దేశ భవిష్యత్ ,అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ఏకైక వ్యక్తి శ్రీ రాహుల్ గాంధీ, చేపట్టిన భారత్ జోడో యాత్ర సందర్భంగా పార్టీ కార్యకర్తల నుసమన్వయం చేయడంలో శివశంకర్, చురుకైన పాత్ర పోషించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైన సమయంలోనూ కార్యకర్తలతో కలిసి కొనసాగడం ఆయన రాజకీయ ప్రస్థానంలోని ముఖ్యమైన అంశంగా అనుచరులు పేర్కొంటున్నారు. అదేవిధంగా, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ సురేష్ షెట్కర్ విజయానికి సంబంధించి వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ తన వంతు కృషి చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.తరతరాలుగా కాంగ్రెస్‌తో అనుబంధం శ్రీ డాకూరి శివశంకర్, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో దీర్ఘకాలిక రాజకీయ అనుబంధం ఉంది. ఆయన తాతయ్య కీర్తిశేషులు గాలయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్కమిటీఅధ్యక్షుని గాసేవలందించడంతో పాటు, జోగిపేట పట్టణ సర్పంచ్‌గా రెండు దశాబ్దాలకు పైగా ప్రజలకు సేవలందించరు ఈ కుటుంబ రాజకీయ ప్రస్థానంలో పదవుల కంటే పార్టీ బాధ్యతలకు ప్రాధాన్యత ఇచ్చే సంప్రదాయం కొనసాగిందని,వారికుటుంబానికి సన్నిహితులు పేర్కొంటున్నారు, “కార్యకర్తలతో సన్నిహిత సంబంధం'' శివశంకర్, రాజకీయ శైలిలో ప్రధానంగాప్రస్తావించదగిన అంశం,కార్యకర్తలతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధం. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా,అందరితో కలిసి మెలిసి ఉండటం, సమస్యలను తెలుసుకుని స్పందించడం ,అవసరమైన,సమయంలోకార్యకర్తలకు,అందుబాటులోఉంటం ఆయన ప్రత్యేకతలుగా అనుచరులు పేర్కొంటున్నారు. యువతతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయడం ద్వార జోగిపేట పట్టణం తోటు అందోల్, నియోజకవర్గంలో యువ నాయకుడిగా ఆయనకు గుర్తింపు లభించినట్లుపార్టీ వర్గాలు తెలిపాయి. బీసీ యువ నాయకత్వంపై చర్చ' సంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో బీసీ సామాజికవర్గానికిచెందిన యువనాయకత్వానికి ప్రాధాన్యత కల్పించాలనే అంశంపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి పార్టీ బాధ్యతల కోసం శివశంకర్,పేరు కూడా వినిపిస్తుంది,

# శేరిలింగంపల్లిలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వెంటనే కేటాయించాలి



**మియాపూర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్)ఆగస్టు 26** బుధవారం రోజు శేరిలింగంపల్లిలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఇన్‌చార్జ్ కుప్పాడి సంగీత వారి ఆధ్వర్యంలో పెద్ద మియాపూర్ బి బి యు ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్ మాట్లాడు నిజమైన ఇండ్లు లేని నిరుపేదలు నియోజకవర్గంలో వందలాదిమంది గూడు లేకుండా అద్దె ఇళ్లలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నారని

తెలిపారు. అలాంటి వారి కోసం తన సాయి శక్తులు ఉపయోగించి ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో డబుల్ బెడ్ ఆయా ప్రాంతాలలో నియోజకవర్గంలో నుఇంకా చాలామంది లబ్ధిదారులకు కేటాయించకుండా అర్హులైనటువంటి వారికి సైతం ఇవ్వకుండా ఎక్కడబడితే అక్కడ ఖాళీగానే దర్శనమిస్తున్నాయని వాటిలో నిజమైన నిరుపేదలకు ఇవ్వాలని హౌసింగ్ మినిస్టర్ తోపాటు మరికొంతమంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.శేర్లింగంపల్లి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఇన్చార్జి కుప్పాడి సంగీత మాట్లాడుతూ....శేర్లింగంపల్లిలో ఇళ్లు లేని నిరుపేదలు గత మూడేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం తిరు గుతూ ఎన్నో ఇబ్బందులు పడుతు న్నారు.ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు తక్షణమే కేటాయించాలని, ఆల్ ఇండియా ఫార్వ ర్డ్ బ్లాక్ పార్టీ తరఫున రాష్ట్ర ప్రభు త్వానికి, ముఖ్యమంత్రికి డిమాండ్ చేయడం జరిగిందన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుని, అర్హులైన పేద లకు ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే కేటాయించాలని కోరుతూ.. వెంకటేష్ యాదవ్ సీనియర్ నాయకులు వారి అండదండతో నిజమై న పేదలకు న్యాయం దక్కేలా ముందుకు పోరాటం కొనసాగిస్తామని నాయకురా లు సంగీత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గువ్వల శివశంకర్,కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.అర్హులై మన పేదలకు ఇళ్ల కేటాయింపు విషయంపై ప్రభుత్వం తో,రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గత సమావేశంలోని వారు హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో సత్య, శోభ, నారాయణమ్మ, బేగం,బీ.రాజు,కవిత తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు మిలాదు న్నబి ఘనంగా వేడుకలు


## ముస్లిం సోదరులకు అల్లాహ మార్గం లో నడవాలి సోదరులు కు అల్లాహు దారి చూపాలి

కౌతాళం ముస్లిం సోదరులు ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసల్లం మొహమ్మద్ రసూలిల్లాహు వారి మార్గంలో నడవాలని వారు సూచించిన ఐదు పూటల నమాజ్ ను ప్రతి ఒక్కరు ఆచరించాలని మానవ మనుగడకు అందరూ కలిసి ఉండాలని అల్లాహ మార్గములో నడుస్తూ ఇతరులకు ప్రవక్త దారి చూపాలని ప్రతి రోజు పండుగ లా మసీదును ఆచరించాలని మీా చేస్తున్న నమాజు, మంచిపని దర్మం,ఇతరులకు సహాయం కుటుంబం లో ఆరోగ్యం, మంచి మనసు,సిరి సంపదలు ఆ ప్రవక్త ఇవ్వాలని మిాలాదున్నబి కమిటీ సభ్యులు హర్షద్ పేర్కొన్నారు. బుధవారం మిలాద్ ఉన్ నబి మహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ప్రవక్త జన్మదిన సందర్భంగా మిలాద్ ఉన్ నబీ కమిటీ



సభ్యులు వారి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీద్ లను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో ప్రవక్త జెండాలతో అలంకరించారు.4:30 గంటలకు అసర్ నమాజు అనంతరం జెండా జూలూస్ నిర్వహించారు. ఈ ఊరేగింపులో మక్కామదీనా ప్రతిమలు ట్రాక్టర్లు లో ఎంతో చూడ చక్కగా పూలు, విద్యుత్ దీపాలు అలంకరించారు. సోదరులు జెండా చేత పట్టుకొని జామియా మసీద్ నుండి దర్గా వైపు మరియు బిస్మిల్లా సర్కిల్ మీదుగా పాత బస్టాండ్ బుడ్డప్ప షాప్ మీదుగా పురా విధుల్లో ఊరేగింపు గా వెళ్లారు. ఈ వేడుకల్లో ముస్లిం సోదరులు నారే తక్బీర్ అల్లాహ్ అక్బర్ అంటూ నినాదాలు చేశారు. మొహమ్మ ద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మక్కా మదీనా ప్రతిమలు గ్రామ ప్రజలను అలరించాయి. ఏడు గంటలకు మాగ్రిబ్ నమాజ్ అనంతరం మసీదులో ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించి అల్లాహ్ తబురుక్ ముస్లిం సోదరులకు పంచిపెట్టారు. అనంతరం భోజన వసతి కల్పించారు.ఈ వేడుకల్లో మోలి ఉశేన్ వాలి, మొహమ్మద్ ముత్తాలి, రాజహమ్మద్, టైలర్ బాషా లంబు కాజ పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐ రామ్మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు




**కోనరావుపేట ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 26:** కోనరావుపేట మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్‌ను మరిమడ్లకు చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్ఐ రామ్మోహన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

బీజేపీ నాయకులు కుమ్మరి దిలీప్‌కుమార్, బొల్లం శ్రీనివాస్, శ్రీగాధ వేణు, ఉల్లేందుల మధుకర్, కొండం దేవనర్సయ్య, జింక అనోక్ మాట్లాడుతూ నూతన ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో కోనరావుపేట మండలంలో శాంతిభద్రతలు మరింత పటిష్టంగా కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిస్తూ, సామాన్య ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

అనంతరం ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ.. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## మల్లికార్జున స్వామి భ్రమరాంబ దేవి హుండీల లెక్కింపు

శ్రీశైలం. హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 5,88,89,846/-లు నగదు రాబడిగా లభించింది. కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 35 రోజులలో ( 22.07.2026 నుండి 25.08.2026 వరకు) సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 87 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు, 4 కేజీల 250 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 540 - యుఎస్ఏ డాలర్లు, 1610? యు.ఏ.ఇ దిర్హమ్స్, 20 - సింగపూర్ డాలర్లు, 140 ? ఇంగ్లాండు పౌండ్స్, 21 ? మలేషియా రింగిట్స్, 10 ? సౌదీరియాల్స్, 109- బహ్రైన్ దినార్, 100 ? ఓమన్ బైసా, 5 ? ఓమన్ రియాల్స్ మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు , ధర్మకర్తల మండలి సభ్యులు కె. కాంతివర్ధిని పర్యవేక్షించారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డలో అథ్లెటిక్స్ పోటీలు




ఆళ్లగడ్డ ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 28 మరియు 29వ తేదీలలో ఆళ్లగడ్డ శ్రీ సోముల రమణారెడ్డి ఆర్ ఆర్ అకాడమీ చైర్మన్, ఎస్,వి, ఎన్, హరిప్రసాద్ రెడ్డి ప్రెసిడెంట్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి సెక్రటరీ ఏ వి రామసుబ్రహ్మణ్యం, టి వినోద్ , వంశి , వారి ఆధ్వర్యంలో బాలురకు బాలికలకు , అండర్ 10 అండర్ 12 అండర్స్ కొట్టాను అండర్ 17 అండర్ 19 మరియు సీనియర్స్ వివిధ విభాగాలలో 60 మీటర్లు, 100 మీటర్లు , 200 మీటర్లు , 800 మీటర్లు 1500 మీటర్లు షార్ట్ పుట్ మరియు జావలిన్ త్రో క్రీడాంశాలలో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు ఈ పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్ మరియు మెడల్స్ మరియు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ కూడా అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్న వారందరికీ ఇవ్వడం జరుగుతుంది అని ఆర్ఆర్ అకాడమీ నిర్వాహకులు తెలియజేశారు ఆర్ ఆర్ అకాడమీ కోచ్ సుబ్బారాయుడు మాట్లాడుతూ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు తో 28వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు వైపిపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రిపోర్టు చేయగలరని కాంటాక్ట్ నెంబర్ 9966869159 సంప్రదించగలరని తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com